




# మనం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

గురువారం | 27 | జూలై | 2023 | పేజీలు : 12


# రెడ్ అలెర్ట్



## పెరుగుతున్న గోదావరి

### రెండో ప్రమాద హెచ్చరిక జారీ
### బుధవారం రాత్రి 12 గంటలకు
### 48.80 అడుగుల నీటిమట్టం

**భద్రాచలం, జూలై 26(మనం న్యూస్) :** భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతోంది. బుధవారం రాత్రి 12 గంటలకు 48.80 అడుగులు ఉంది. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం నుండి గోదావరి పెరుగుతోంది. వర్షం ఇంకా తగ్గకపోవడంతో అధికారులను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అప్రమత్తం చేశారు. మంత్రి పువ్వాడ ఎప్పటికప్పుడు కలెక్టర్‌తో మాట్లాడుతూ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడనే అధికారులు ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తాలిపేరు నుండి భారీగా వరద వస్తుండడంతో గోదావరి పెరుగుతోంది. అదే సమయంలో వర్షం మాత్రం తగ్గడం లేదు. కుండపోతగా కురుస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## తగ్గని వాన – ప్రజలు బయటకు రావద్దు
## సహకరించాలి : భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించారని , 7 లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు మూత పడ్డాయని, మరో 15 మార్గాల్లో చప్టాలు నీట మునుగుతాయని ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ ప్రియాంక, జిల్లా ఎస్పీ వినీత్ జి భద్రాచలం లో రాత్రి ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశం లో కోరారు. 2 వేల చెరువుల్లో 1035 ఇప్పటికే నిండాయని, రెండు రోజుల్లో మరో 500 చెరువులు నిండి పొంగి పొర్లుతాయని తెలిపారు. వర్షం, గోదావరి వరద వల్ల కొన్ని గ్రామాల్లోకి నీరు చేరుతుందని, ఆయా గ్రామాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. 23 మండలాల్లో అత్యవసరం ఉంటే తప్ప బయట కు రావద్దని సూచించారు. ప్రతి గ్రామం లో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉంటారని, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దు. అత్యవసరం ఉంటే కంట్రోల్ రూమ్ కు కాల్ చేయాలని కలెక్టర్ ప్రియాంక తెలిపారు. ఎస్పీ వినీత్.జి మాట్లాడుతూ పోలీస్



యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. గోదావరికీ రెండో ప్రమాద హెచ్చరిక అమల్లో ఉందన్నారు. 2 ఎన్ డి ఆర్ ఎఫ్ టీం లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకటి దుమ్ముగూడెం ఉంది, చర్ల లో 40 కుటుంబాలను రెస్క్యూ చేసి, పునరావాస కేంద్రం లో ఉంచామన్నారు. మరి కొన్ని గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. పోలీస్ యంత్రాంగం నిరంతరం రెస్క్యూ కు అందుబాటులో ఉంటుందన్నారు.

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పువ్వాడ

### కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ
### వివరాలు తెలుసుకుంటున్న మంత్రి
### ముంపునకు గురయ్యే ప్రాంత ప్రజలను
### పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం

**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** భద్రాచలం వద్ద గోదావరి బుధవారం రాత్రి 7గంటలకు 46.70 అడుగులకు చేరిన నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అల ను పోన్ ద్వారా ప్రస్తుత పరిస్థితుల వివరాలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు. ఎగువ నుండి గోదావరికి భారీగా నీరు పోటెత్తడంతో జిల్లా వ్యాప్తంగా ముంపుకు గురయ్యే పరివాహక ప్రాంత ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస ప్రాంతాల్లో నిర్వాసితులకు భోజనం, త్రాగునీరు, విద్యుత్,



ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ముంపు ప్రమాదం ఉన్న వారిని తక్షణే గుర్తించి వారందరిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.వరద ఉధృతి దృష్ట్యా ప్రజలు జిల్లా యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించాలని, అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర 11లో..

## ప్రభుత్వ సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి

### – జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26 (మనం ప్రతినిధి) :** వర్షాలు, వరదలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వ సిబ్బంది పని చేసే కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. రానున్న రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే పరిస్థితులు, గోదావరి వరద పరిస్థితిపై భద్రాచలం ఆర్డిఓ కార్యాలయం నుండి రాత్రి రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, రహదారులు భవనాలు, మిషన్ భగీరథ, విద్యుత్, వైద్య, సెక్టోరియల్, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు మన జిల్లా ఆరెంజ్ జోన్ లో ఉన్నట్లు చెప్పారు. తహశీల్దార్లు, ఎంపిడీఓలు హై అలెర్ట్ గా ఉండాలని చెప్పారు. ఏర్పాటు చేసిన టీములు కూడా సహాయక చర్యల్లో పాల్గొనాలని చెప్పారు. ప్రత్యేక అధికారులు సెక్టోరియల్ అధికారులు కేటాయించిన మండలాల్లో వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని చెప్పారు.మండలాల్లో సమస్యాత్మక ప్రాంతాలున్నాయో సమగ్ర జాబితా ఉండాలని చెప్పారు. చెరువులు పరి రక్షణ చర్యలు చేపట్టాలని ఇసుక బస్తాలు



అందుబాటులో ఉంచాలన్నారు. రోడ్లపైకి నీరు చేరిన ప్రాంతాల్లో రాకపోకలు పటిష్ట నియంత్రణ చేయాలని చెప్పారు. మండలాల్లో ముంపుకు గురయ్యే గ్రామలున్నాయి, నీట మునిగే రోడ్లున్నాయి, చెరువుల యొక్క స్థితిపై సమగ్ర సమాచారం ఉండాలని చెప్పారు. గ్రామ స్థాయి నుండిశిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. ములకలపల్లిలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని అలాంటి నీట మునిగే ప్రాంతాల్లో ప్రయాణాలు చేయకుండా ట్రాక్టర్లు అడ్డుగా పెట్టాలని చెప్పారు. మండల స్థాయి టీములు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడా విద్యుత్ సమస్య రావొద్దని, ఫిర్యాదులు వస్తే తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. మంచినీటి సమస్య రావొద్దని, సరఫరా ఆగిపోయిన గ్రామాలకు 11లో..

# అక్షరం రుణం తీర్చుకుంటున్నా...

**– వురిమళ్ల ఫౌండేషన్ ఏర్పాటు వెనుక నా జీవిత నేపథ్యముంది..**
**– ఈ నెల 30న పురస్కారాల ప్రదానోత్సవ సభ**
**–ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తాం...**
**– అక్షరాల తోవ త్రయం సహకారం మరువలేనిది...**
**– ప్రతి రచయిత ముందు తరాల వారి రచనలు చదవాలి**
**– అప్పుడే సాహిత్యంలో రాణిస్తారు...**

**వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద**





**ఖమ్మం, జూలై 25(మనం బ్యూరో) :** సమాజంలో నాకు గుర్తింపు తెచ్చిన అక్షరం రుణం తీర్చుకునేందుకు వురిమళ్ల ఫౌండేషన్‌ను స్థాపించాం. మా తాతగారు నేర్పిన విలువలతో నా జీవితం సాగింది. సోదరి లాగా కాకుండా అమ్మ తర్వాత అమ్మగా సేవలు చేసిన సోదరి అత్త, భర్తల రాక్షసత్వానికి బలైంది. వారిద్దరి జీవితాలను ఈ సమాజానికి గుర్తు చేసేందుకు వారి పేరు మీదన కథల, కవితల పోటీలు నిర్వహిస్తూ నగదు పురస్కారాలు అందచేస్తున్నాం. మా వారిని, వారి కుటుంబ సభ్యులను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన మా అత్త, మామ పేరు మీద ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎనలేని సాహిత్య సేవ చేస్తున్న సాహితీ మూర్తులకు భోగోజు సముద్రమ్మ–పురుషోత్తం స్మారక సాహిత్య పురస్కాం అందచేస్తున్నామని వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద పేర్కొన్నారు. ఈ నెల 30న వురిమళ్ల ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరుగనున్న నేపథ్యంలో మనం పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వారి వివరాలు ఇలా.....

**వురిమళ్ల ఫౌండేషన్ ఏర్పాటు, పురస్కారాలు అందజేయడానికి ప్రధాన ఉద్దేశ్యం....?**

ఈ ప్రశ్న వెనుక నా జీవిత నేపథ్యం ఉంది. అది చెబితేనే ప్రశ్నకు సరైన సమాధానం అవుతుంది. నేను పుట్టిన ఊరు సూర్యాపేట జిల్లా మోతె మండలం, సిరికొండ. చాలా కుగ్రామం. మా బాపు (నాన్నగారు) ఉద్యోగ రీత్యా వివిధ ఊర్లలో పని చేస్తున్న సమయంలో నన్ను మా తాతయ్య వురిమళ్ల శ్రీరాములు (మా బాపు వాళ్ళ నాన్న) దగ్గర ఉంచి వెళ్ళడం వల్ల , మా తాతయ్యతో పెరిగిన అనుబంధం, ఆయన నాకు చెప్పిన నైతిక విలువల కథలు, ఊరిలో ఓ పెద్ద మనిషిగా కులమతాలకు అతీతంగా వ్యవహరించిన తీరు నా మనసుపై చెరగని ముద్ర వేశాయి. నా పదవ తరగతిలో పెళ్ళి అయ్యేంత వరకూ తాతయ్య గ్రాండ్ ఫాదరే కాదు గాడ్ ఫాదర్ కూడా. ఎవరితో ఎలా మాట్లాడాలో, మసలుకోవాలో చెప్పిన గురువు తాతయ్యే. మేము నలుగురం అక్క చెల్లెండ్లం .నా తరువాతి చెల్లికి నాకు చాలా ఆత్మీయమైన సోదరి బంధం కంటే స్నేహ బంధం ఎక్కువగా ఉండేది. నేను బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తే చూడాలని ఉందనేది. తను అమ్మ తర్వాత అమ్మ నాకు. ఊరిలో అందరితో ఓ అమ్మ మనసున్న అమ్మాయిలా మా చెల్లి పద్మజ ఎంతో అభిమానం పొందింది. చెల్లికి పదవ తరగతి కాగానే పెళ్ళి అయ్యింది. కానీ మొగుడు, అత్త మహా క్రూరంగా పెళ్ళయి ఐదు నెలలు కూడా నిండకుండానే ఇంటి వెనుక కొబ్బరి చెట్టుకు కట్టేసి కిరోసిన్ పోసి దారుణంగా చంపేశారు. అనురాగం, ఆప్యాయత, మానవీయత నేర్పిన ఆ ఇద్దరు ప్రతి క్షణం నా మదిలో మెదులుతూ ఉంటారు. అలాంటి గొప్ప మనసున్న వాళ్ళిద్దరి పేర్లను సమాజానికి పరిచయం చేయాలన్న తపనే ఈ వురిమళ్ల ఫౌండేషన్ ఏర్పాటుకు కారణం. అందులోనూ చిన్నప్పటి నుండి నాలో కలిగిన చదువు పట్ల ప్రేమ, సాహిత్యాభిరుచి, ఈ సమాజానికి నన్ను ఓ ఉపాధ్యాయినిగానే కాకుండా ఓ కవయిత్రి, రచయిత్రి, పాఠ్య పుస్తక రచయితగా పరిచయం చేసింది. అక్షరం రుణం తీర్చుకునేందుకు, మా తాతయ్య, చెల్లి ఎప్పటికీ సజీవ స్మృతిలో ఉండేందుకు నేను తీసుకున్న నిర్ణయం ఇది. ఈ నిర్ణయాన్ని సంపూర్ణంగా ఆమోదిస్తూ నా జీవిత భాగస్వామి అయిన భోగోజు ఉపేందర్ రావు ప్రోత్సాహం, తోడ్పాటు ఎంత గొప్పదో మీ అందరికీ తెలుసు. ఆ విధంగా ఐదు సంవత్సరాలుగా వురిమళ్ల ఫౌండేషన్ ద్వారా వురిమళ్ల శ్రీరాములు పేరిట కథలు, వురిమళ్ల పద్మజ పేరిట కవితల పోటీలు నిర్వహించి నగదు పురస్కారాలు ఇస్తూ వస్తున్నాం. మా చెల్లి 'వురిమళ్ల పద్మజ' పేరుతో నేను పని చేసే పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతి వారీగా ప్రథమ ద్వితీయ, బహుమతులు అంద జేస్తున్నాను.

**ఇప్పటి వరకు భోగోజు సముద్రమ్మ –పురుషోత్తం స్మారణ సాహిత్య పురస్కారం ఎవరెవరికి అందజేశారు...?**

ఇక ఈ విషయానికి వచ్చినట్లయితే... దీనికి కూడా ఓ కారణం ఉంది. మా అత్త , మామ మావారిని మా వారి అన్నదమ్ములను ఎంతో ఉన్నతంగా తీర్చి దిద్దారు. ఆర్థికంగా ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నా, వారందరినీ ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా చేశారు. అందుకని వారిద్దరినీ గౌరవించుకోవడం కోసం జిల్లా స్థాయిలో భోగోజు సముద్రమ్మ–పురుషోత్తం స్మారక పురస్కారం అందజేయడం జరుగుతోంది. మొట్టమొదటి సారిగా 2019లో ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలంలో ఉన్న అ భి న వ మొల్ల చక్రవర్తుల లక్ష్మీ నర్సమ్మకి, 2020లో ప్రముఖ సాహితీ వేత్త, ఆంగ్ల అధ్యాపకులు కీ.శే పొత్తూరి వేంకట సుబ్బారావుకు, 2021లో ప్రముఖ కవి, రచయిత, అధ్యాపకులు డాక్టర్ దిలావర్‌కి, 2022 లో ప్రముఖ కవయిత్రి రచయిత్రి, తెలంగాణ గజల్ రచయిత్రిగా సినారె ప్రశంసలు అందుకున్న భైరి ఇందిరకి స్మారక పురస్కారాలు అంద జేశాము. ఈ ఏటా ప్రముఖ రచయిత, నంది అవార్డు గ్రహీత తాటికొండాల నర్సింహా రావుకు అందచేస్తున్నాం.

**ఫౌండేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తారా.....భవిష్యత్ కార్యక్రమాలేంటి....?**

ఇది చాలా చాలా ముఖ్యమైనది. దీనికి సంబంధించి సందేహ పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఫౌండేషన్ ఏర్పాటు చేసినప్పుడే అనుకున్నాం. ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా నిరంతరం కొనసాగించాలని. నేను ప్రస్తుతం ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయినిగా పని చేస్తూ ఉన్నాను. నేను రిటైర్డ్ అయ్యాక కూడా నాకు వచ్చే బెనిఫిట్స్ లో కొంత ఎమౌంట్ తీసి బ్యాంకులో ఫిక్సడ్ డిపాజిట్ చేయాలనే ఆలోచనలో ఉన్నాను. ఆ ఎమౌంట్‌తో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగుతుంది. ప్రస్తుతం పెద్దలతో పాటు పిల్లల కోసం కూడా కవితలు, గేయాలు, కథల పోటీలు నిర్వహిస్తూ ఉన్నాను. భవిష్యత్తులో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు మరికొన్ని ప్రక్రియల్లో రచనల పోటీలు ఫౌండేషన్ ద్వారా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నాను.

**ప్రతి ఏటా పురస్కార సభ నిర్వహిస్తున్న క్రమంలో ఎదురైన అనుభవాలు....?**

జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి, అత్యుత్తమ కథలు, కవితలు రాసిన సాహితీ వేత్తలకు పురస్కారాలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. ఎందరో లబ్ద ప్రతిష్టులైన కవులు, రచయితలు మేం నిర్వహించే పోటీల్లో పాల్గొనడం, బహుమతులు పొందడం మేం స్థాపించిన ఫౌండేషన్ పట్ల ఉన్న ఆసక్తి, అభిమానంగా చెప్పు కోవచ్చు. ఈ ఫౌండేషన్ కు సంబంధించిన పురస్కార సభ నిర్వహణలో ప్రతి క్షణం వెన్నుదన్నుగా ఉన్న అక్షరాల తోవ త్రయం నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకోవాలి. తమ స్వంత సంస్థగా భావించి నన్ను ఓ సోదరిగా, మాతృ సమానంగా గౌరవిస్తూ సభా నిర్వహణను తమ భుజాలపై వేసుకుని జయప్రదం చేస్తున్నారు. అందువల్ల వార్షికోత్సవ వేడుకలు ఎలాంటి ఆటంకం లేకుండా జరుగు తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి కవి, రచయిత, సాహితీ వేత్తలు మా కార్యక్రమాలకు ఆదరణ చూపుతున్నారు. వారందరికీ పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

**అనేక సాహిత్య ప్రక్రియల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా మీరు రూపొందడానికి ఎలాంటి శిక్షణ తీసుకున్నారు....**

ఈ ప్రశ్న అడగడంలో మీ అభిమానం కనబడుతోంది. నేను ఎక్కడా ఎలాంటి శిక్షణ తీసుకోలేదండీ. ప్రతిదీ నేర్చుకోవాలి, అందులో కొంతైనా నైపుణ్యం పెంచుకోవాలనే తపనే నన్ను వివిధ ప్రక్రియలను గురించి తెలుసుకునేలా, రాసేలా చేస్తోంది.. అలా బాల సాహిత్యంలో కథలు, గేయాలు, లేఖలు, ప్రౌఢ సాహిత్యం లో కథలు, కవితల సంపుటాలు వచ్చాయి. ఇంకా సమీక్షా వ్యాసాలు, గేయాలు, గజల్స్, శ్రీపదాలు ,హరివిల్లులు, హైకూలు, నానీలు, రుబాయిలు, మధురిమలు సుభాషితాలు మొదలైనవి రాశాను. ప్రస్తుతం నేను వివరణాత్మకంగా రాస్తున్న సంస్కృత న్యాయాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఆంధ్ర ప్రభ దినపత్రిక వారు ఫోన్ చేసి సోమవారం వచ్చే చింతన పేజీలో ప్రతి సోమవారం ధారావాహికంగా వేసుకుంటున్నారు. అంతర్జాల పత్రిక మొలకలో ప్రతిరోజూ, నేటి నిజం, తపస్వి మనోహరం పత్రికలో వారం వారం సునంద భాషితం, సునందామృతం పేరుతో రావడం చాలా ఆనందంగా ఉంది. నేను ముందు చెప్పినట్లుగా చదువంటే ఇష్టం, సాహిత్యం అంటే మహా ఇష్టం. నేను బడిలో చదువుకునే టప్పుడే బోలెడన్ని పుస్తకాలు చదివాను. ఇంట్లో చంద మామ, బుజ్జాయి, బాలమిత్ర లాంటి పుస్తకాలతో పాటు బడిలో బాల సాహిత్యంతో పాటు వేయి పడగలు, అపూర్వ చింతామణి లాంటివి కూడా చదివాను.

**ప్రస్తుత యువ కవులకు మీరిచ్చే సందేశం...?**

నేను ఎప్పుడూ విద్యార్థినినే. గురువులా సందేశం ఇచ్చేంత ఎదగ లేదు. కాకపోతే నా తోటి విద్యార్థులుగా యువ కవులను భావిస్తూ చెప్పేదేమిటంటే... అధ్యయనం చేయాలి. మన కన్నా ముందున్న ప్రముఖ సాహితీ వేత్తల రచనలు చదవాలి. అప్పుడే ఏ ప్రక్రియ ఐనా సరే అందులోని మెళకువలు తెలుస్తాయి. మనం రాసుకున్న రచనలను మనవి కావు అనుకుంటూ ఎదుటి వారి కోణంలో చదివితే అందులోని లోపాలు తెలుస్తాయి. అయినా ఇప్పటి యువ కవులు కొందరు అద్భుతంగా రాస్తున్నారు. తోటి వారి సాహిత్యాన్ని కూడా చదవాలి. కవిగా రచయితగా పేరు తెచ్చుకోవాలని అనుకుంటే రైతులా మారాలి. రైతు నిరంతర శ్రామికుడు. నాణ్యమైన పంట దిగుబడి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఉంటాడు. మనమూ అలా మారితే, అధ్యయనమనే కృషి చేస్తే, సాహితీ సేద్యం చేస్తే తప్పకుండా ఓ మంచి కవిగానో, రచయితగానో సాహిత్య ప్రపంచంలో ఉనికిని చాటుకోగలం. మీకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

**రాబోయే కాలంలో మీ కలం నుండి రానున్న పుస్తకాల వివరాలు...?**

రాబోయే కాలంలో నా కలం నుండి రాబోయే రచనలు చాలానే ఉన్నాయి.1.బామ్మ చెప్పిన బంగారు కథలు' బాలల కథల సంపుటి 2. అక్షర మాలికలు అక్షరాల మీద రాసిన గేయాల సంపుటి 3.గూట్లో దీపం – గత కాలపు వైభవం ( బచ్ పన్ ముచ్చట్లు) 4. సునంద భాషితం (సుభాషితాల సంపుటి) 5.బుజ్జాయిలతో నేను 6. పెద్దల కథలు (కథా సంపుటి ఇంకా పేరు పెట్టలేదు) 7.శ్రీ పదాలు ( సంపుటి) 8.హరివిల్లుల సంపుటి 9. గజల్ సంపుటి మొదలైనవి రాబోయే రచనలు .

# ఎడతెరపి లేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

## పలు చెరువులు మత్తడి
## జిపి వర్కర్ల సమ్మెతో పడకేసిన పారిశుధ్యం





**తిరుమలాయపాలెం, జూలై 26 (మనం న్యూస్) :** గత వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కాకరవాయి మేకల తండా ఇస్లావత్ తండా దమ్మాయిగూడెం తెట్టెలపాడు తాళ్లచెరువు బీరోలు బచ్చోడు బచ్చోడు తండా పైనంపల్లి రాజారం సోలిపురం జూపెడ మాదిరిపురం సుబ్లేడు పలు గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీ వర్కర్ల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది కనీసం పంచాయతీ సర్పంచులు గాని కార్యదర్శులు గాని ఎలాంటి సహాయక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు పత్రికా విలేకరులతో మొరపెట్టుకుంటున్నారు. మండలంలోని కొక్కిరేణి పిండిప్రోలు జల్లేపల్లి పలు గ్రామాల్లో చెరువులు మత్తడి తొక్కుతున్నాయి పలు గ్రామాల్లో వీధి బజార్లు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి గ్రామ పంచాయతీ వర్కర్లు సమ్మెబావట పట్టడం గ్రామాల్లో తడి చెత్త పొడి చెత్త సేకరించకపోవడం వలన అస్తవ్యస్తంగా గ్రామాలు మారాయని ప్రజల ఆరోపిస్తున్నారు. సుమారు వారం రోజుల నుండి వర్షాలు కురవడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. ఈ సంవత్సరం వర్షాలు మొదట పడకపోవటంతో ఖరీఫ్ సీజను కొంత ఆలస్యమైన రైతులు పత్తి పంటను అధిక సంఖ్యలో నాటారు జులై నెలలో అధిక వర్షాలతో పత్తి చేలు నీట మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఎకరానికి సుమారు 30000 ఖర్చుపెట్టి పంటలు సాగు చేయగా అధిక వర్షాలతో ప్రతి మొక్కలు ఎర్రబాడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# విశాలమైన వైద్య ఆసుపత్రి – మొక్కుబడిగా ఇద్దరు డాక్టర్లు

## వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు : బీఎస్పీ జిల్లా నాయకులు అల్లిక వెంకటేశ్వరరావు









**తిరుమలాయపాలెం, జూలై 26 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం 30 పడకల ఆస్పత్రిని బుధవారం బిఎస్పి నాయకుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు యాదవ్ ఆకస్మికంగా సందర్శించారు. 10 మంది డాక్టర్లకుగాను ముగ్గురు డాక్టర్లు మాత్రమే దర్శనమిచ్చారు. ఇదేమిటని డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు అక్కడున్న వైద్యసిబ్బందిని ప్రశ్నించగా తమకేమి తెలియదని, సూపరింటెండెంట్ జిల్లా కేంద్రానికి వెళ్ళారని సమాధానం ఇచ్చారు. అయితే ప్రస్తుతం కుండపోత వర్షాలు, పంచాయితీ ఉద్యోగుల సమ్మెతో పారిశుధ్యలోపం కారణంగా అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ పరిస్థితిలో కరువు ప్రాంతమైన తిరుమలాయపాలెంలో వైద్యవసతులు సరిగా లేవన్న ఫిర్యాదులతో తాము ఆస్పత్రికి వచ్చామని అల్లిక వెంకటేశ్వరరావు వైద్యులకు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులను కొన్ని ప్రశ్నలు వేశారు. తిరుమలాయపాలెం 30 పడకల ఆస్పత్రిలో ఒక సూపరింటెండెంట్తోపాటు జనరల్ సర్జన్ ఒకరు, పీడియాట్రిషన్ ఒకరు, జనరల్ ఫిజీషియన్ ఒకరు, గైనకాలజిస్ట్ ఒకరు, ఒక అనస్థటిస్ట్ (మత్తు డాక్టరు)ఒక ఆర్థోపెడీషియన్ (ఎముకల డాక్టర్) ఒక డెంటర్ సర్జన్, ఆయుర్వేదం డాక్టర్ ఒకరు ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే డ్యూటీకి రావడంవల్ల ప్రజలకు ఏవిధంగా మిగిలిన వైద్యసేవల్ని అందిస్తారని ప్రశ్నించారు. అలాగే 24 మంది స్టాఫ్ నర్సులు, 5 మంది ఫార్మిసిస్టులు, రేడియోగ్రాఫర్, డైటీషియన్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, ల్యాబ్టెక్నీషియన్ ఉండాలని 30 పడకల ఆస్పత్రికి సంబంధించిన నిబంధనలో ఉందని కానీ వాస్తవానికి ఇక్కడ సిబ్బంది వైద్యవసతులు భిన్నంగా ఎందుకున్నాయని నిలదీశారు. 24 గంటలూ గర్భిణీ స్త్రీలు ప్రసవించడానికి తగిన వైద్యవసతులు ఉండాలని నిబంధనలో ఉండగా సాయంత్రం పూట తలుపులు మూసేస్తున్నారని ఫిర్యాదు అందిందని చెప్పారు. ఇక్కడ శిశువులకు సంబంధించి న్యూబర్న్ స్టెబలైజేషన్ యూనిట్ ఉందా? మినిమం నియోనేటర్ కేర్ అందుతుందా? పిల్లలకు కావాల్సిన ఇమ్యూనైజేషన్ ( వ్యాక్సిన్స్ ) అందిస్తున్నారా? అని ప్రశ్నించారు. వార్డుల్లో 5 మంది నర్సులు ఉండాలి. క్యాజువాలిటీలో 3 నర్సులు, ఓపి గదుల్లో నలుగురు, డెలివరీ రూములో ఒకరు, ఇంజక్షన్రూములో ఒకరు, ఓటి రూములో ఒకరు, ఐసియులో ఒకరు ఉండాలని నిబంధనలో ఉండగా వారంతా ఏమయ్యారని వైదుల్ని అడిగారు. ఈ సందర్భంగా వైద్యులు తిరుమలాయపాలెం ఆస్పత్రిని అప్గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారేగానీ సిబ్బంది, వైద్యవసతుల్ని ఇంకా సమకూర్చలేదని సమాధానం ఇచ్చారు.ప్రభుత్వం సంవత్సరాల తరబడి ప్రకటనలు చేస్తూ ఉండటమే తప్ప ఆచరణలో చూపించడం లేదని, ఇది చాలా అన్యాయమని, తిరుమలాయపాలెం ప్రజల్ని వైద్యం పేరుతో ప్రభుత్వం మోసం చెయ్యడమేనని విమర్శించారు.

# సిపిఎం సానుభూతిపరుడు బాలస్వామి మృతి

**నేలకొండపల్లి, జూలై 26(మనం న్యూస్) :** మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరుడు పాలపల్లి బాలస్వామి(56) బుధవారం మరణించారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి, పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలస్వామి పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. నేడు ఆయన మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన భౌతిక ఆయన సందర్శించిన వారిలో పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ కూరపాటి ప్రసాద్, జడ క్రాంతి కుమార్, రాయల రవి, తాళ్ల రమాదేవి, బేబీ, రాణి, గోవర్ధన, రాణి తదితరులు ఉన్నారు.

# రెవెన్యూ అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** ఖమ్మం రెవిన్యూ అదనపు కలెక్టరుగా డి.మధుసూదన్ నాయక్ బుధవారం ఉదయం పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు, అదనపు కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ గా పనిచేయుచున్న డి. మధుసూదన్ నాయక్ ని ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ, మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

# పాలేరు రిజర్వాయర్ను సందర్శించిన పువ్వాళ్ళ, రాయల



**కూసుమంచి, జూలై 26 (మనం న్యూస్):** పాలేరు రిజర్వాయర్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , టీపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు సందర్శించారు.. రిజర్వాయర్ నీటిమట్టం పూర్తి స్థాయిలో పెరగడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు, పాలేరు ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో,పాడి పంటలతో సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు. నీటి ప్రవాహం పెరగడం మత్సకారుల అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్ళొద్దని కోరారు. అనంతరం మత్సకారుల వద్ద చేపలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, యడవల్లి రాంరెడ్డి, ఉన్నం రాజశేఖర్, బచ్చలికూరి నాగరాజు,పొట్ల కిరణ్, గుగులోతు మోహన్, చిట్యాల రమేష్,బత్తుల రమేష్, బానోతు హరినాథ్,యడవల్లి నాగరాజు, వీరబాబు,తదితరులు పాల్గొన్నారు..

# రాజేశ్వరపురంలో డబుల్ ఇళ్లలోకి చేరిన నీరు

## సందర్శించిన కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**నేలకొండపల్లి, జూలై 26(మనం న్యూస్) :** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో పేదలకు ప్రభుత్వ నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి నీరు చేరడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి లబ్ధిదారుడా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వానికి పేదల ఇండ్ల నిర్మాణం పట్ల ముందు చూపు లేక నిర్లక్ష్యంగా, ఇష్టానుసారంగా నిర్మించడంతో వర్షాకాలంలో ప్రతి ఏటా పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లోతట్టు ప్రాంతాలలో డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించడం వల్లే చిన్నపాటి వర్షం వచ్చిన ఇళ్లలోకి నీరు చేరి ప్రతి ఏటా బాధిత కుటుంబాలు అవస్థలు పడుతున్నారన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇండ్ల మధ్యలో నీరు చేరి నిలిచిపోవడంతో ఈగలు, దోమలు, పందులకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. ప్రజలకు అనువైన ప్రదేశంలో కాకుండా లోతట్టు ప్రాంతాలలో ఇల్లు నిర్మించడం వలనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇండ్ల నిర్మాణంలో కూడా సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మించారన్నారు. లబ్ధిదారులు వర్షపు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకున్న పరిస్థితి లేదని విమర్శించారు. పాలేరు నియోజకవర్గంలో అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి పేదలంటే చిన్న చూపని రానున్న కాలంలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, దండా సత్యనారాయణ, పుసులూరి శారద, చిట్యాల రమేష్, మండల యువజన కాంగ్రెస్ నాయకులు యడవల్లి నాగరాజు, రెడ్డేబోయిన నవీన్, కుమ్మరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి కార్మికుల పట్ల మొండి వైఖరి విడనాడాలి

## ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాలి

### సీపీఐ( ఎంఎల్ – న్యూడెమోక్రసి) కార్యదర్శి షేక్ ఖాసిం





**వైరా, జూలై 26(మనం న్యూస్):** ఉదయం నిద్ర లేచింది మొదలు గ్రామాలను శుభ్రంగా ఉంచుతూ ప్రజల దాహర్తి తీర్చే కార్మికుల బాధ్యతను పాలక వర్గాలు విస్మరిస్తున్నాయని, వెట్టి చాకిరీ చేసే కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాల్సిన అవసరం ఉందని సీపీఐ( ఎంఎల్ – న్యూడెమోక్రసి) కార్యదర్శి షేక్ ఖాసిం పేర్కొనానరు. సమయపాలన లేకుండా ఎట్టి చాకిరీ చేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. చాలీ చాలని వేతనాల మధ్య నిత్యం అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న ధరలతో కుటుంబాలను పోషించలేక అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్న కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు దిగారని తెలిపారు. ఆయన మాటల్లోనే...

రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో సుమారు 50000 వేల మంది మల్టీ పర్పస్ కార్మికులుగా చాలి చాలని వేతనంతో పని చేస్తున్నారు. 2001సంవత్సరంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఒకళ్ళో, ఇద్దరో గుమస్తాలుగా పని చేసేవాళ్ళు. ఆ రోజుల్లో వాళ్ళకు రూ500ల నుంచి రూ1000లు జీతంగా చెల్లించేవి అప్పటి పంచాయతీ పాలక వర్గాలు. పాఠశాలలతోపాటు పంచాయతీ కార్యాలయాలను ఊకడం, మంచినీరు పెట్టడం వంటి పనులు చేయించుకుంటూ అరకొర వేతనం ఇచ్చేవారు. వచ్చే కొద్దిపాటి వేతనం తోటే కాలం వెళ్ళదీసేవారు గుమస్తాలు. వేతనం సరిపోవట్లేదని సదరు గుమస్తాలు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె దిగారు. దీంతో ప్రభుత్వం 2019లో నవంబర్ నుంచి మల్టీ పర్పస్ విధానం పేరుతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో ఐదు నుంచి ఎనిమిది మంది వరకు కార్మికుల్ని నియమించింది. ఎనిమిది వేల ఐదు వందల జీతం ఇస్తూ నిర్థిష్టమైన సమయ పాలన కానీ పని విధానం అంటూ లేకుండా వారితో వెట్టి చాకిరి చేయిస్తున్నారు పంచాయతీ పాలకులు. నిర్దిష్టంగా ఒక పనితో నిమిత్తం లేకుండా వివిధ రకాల పనులు చేయిస్తున్నారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి వీధుల వెంట తిరుగుతూ చెత్తా చెదారాన్ని ఊడ్చటం, పోగు చేసిన చెత్త కుప్పలు ఎత్తడం, మురుగు కాలువల్లో పూడిక తీయడం, ట్రాక్టర్ పై చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించటం, వీధుల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను నరకటం, మంచినీటి సరఫరాతోపాటు మిషన్ భగీరథ పైపులైన్లల మరమ్మతులు వంటి 15 రకాల పనులను చేయిస్తున్నారు. జంతువుల కళేబరాలు, మానవుల మృతదేహాల తొలగిస్తూ నిత్యం మలినాలతో సహజీవనం చేస్తుంటారు. పారిశుద్ధ్య పనిచేసే కార్మికులు నిర్థిష్టమైన వేతనం ఇవ్వాలని చట్టం చెపుతున్న పట్టించుకోవపోవటం ప్రభుత్వ చిత్తశుద్ధికి లేమికి నిదర్శనం. గ్రామ పంచాయతీలలో పని చేసే వర్కర్లులందరు ఎస్సీ, ఎస్టీ, బీసి వర్గాలకు వాళ్ళే. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే వర్కర్లుగా పని చేస్తున్నారు. వాస్తవానికి వారికి ఈ వృత్తే జీవనాధారం. వ్యవసాయ భూములు కానీ ఎలాంటి ఇతర ఆర్థిక వనరులు లేవు. నిత్యం అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న ధరల నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే వేతనం తమకు సరిపోదని తమకు న్యాయబద్ధమైన కనీస వేతనం తోపాటు పీఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాడ్యుటిటీ తదితర గుర్తింపు కార్డులు ఇవ్వాలనే డిమాండ్లతో పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ నెల 6వ తారీకు నుంచి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చట్టబద్ధంగా సమ్మ చేస్తున్నారు. గత 20 రోజులుగా విధులు బహిష్కరించి డిమాండ్ల సాధన కోసం మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారు. గ్రామ స్థాయి ఉద్యోగి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ప్రభుత్వం సెలవులను మంజూరు చేస్తుంది. కానీ పంచాయతీ కార్మికులు మాత్రం సెలవులు ఇవ్వటం లేదు. సెలవు కావాలంటే బెదిరింపులు వేధింపులు తప్పటం లేదు. జ్వరం వచ్చిన ఇతర పనులు ఉన్నా మానుకొని విధులకు వెళ్ళాల్సిందే. సెలవు ఇచ్చేందుకు పంచాయతీ పాలకవర్గాలు నిరాకరిస్తున్నారు. వచ్చే జీతం కుటుంబ పోషణకు సరిపోక అప్పులు చేసి జీవనం సాగిస్తూ అప్పులు పాలౌతున్నారు. వాస్తవంగా గ్రామాలలో వ్యవసాయ, ఇతర పనులకు వెళితే రోజు కూలీ రూ500లు కూలీ ఇస్తున్నారు. రైతు వద్ద పని చేసే కూలీలకు నెలకు రూ15000ల నుంచి రూ20000వేలు జీతం ఇస్తున్నారు. కార్మికులకు సమయపాలన లేకపోవడంతో ఉదయం ఐదు గంటలకి పనిలోకి వెళ్లిన కార్మికుడు ఇంటికి వెళ్ళేసరికి రాత్రి అవుతుంది.ఎట్టి చాకిరి చేస్తున్నా కనీస వేతనం ఇవ్వటానికి ప్రభుత్వం నిర్లక్ష ధోరణి అవలంబిస్తుంది. గ్రామపంచాయతీ వర్కర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. చట్ట ప్రకారం కార్మికులు కోరుకునేది కనీస వేతనం రూ19000లు ఇవ్వాలి. అనారోగ్యానికి గురైన వర్కర్లు, వాళ్ల కుటుంబాలకు ఆసుపత్రి ఖర్చుల మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలి. ఏడాదికి సరిపడ చెప్పులు, బట్టలను అందించటంతోపాటు పిల్లల చదువుల ఖర్చును ప్రభుత్వమే భరించాలి. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి. సమస్యల పరిష్కారానికి కార్మికులు చేస్తున్న పోరాటానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలియజేస్తున్నామని తెలిపారు.

# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సిలార్ సాహెబ్ ఎంపీడీఓ, రూరల్ ఎస్ఐ ఎండి ఉఫాతుల్ రఫీ






**మధిర, జూలై 26(మనం న్యూస్):** మధిర మండలంలో నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర మండల ఎంపీడీఓ షేక్ సిలార్ సాహెబ్ తెలిపారు. మండలలో కట్టలేరు, వైరా నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి అని వర్షాల వల్ల రహదారులపై అడ్డంగా నీరు పారే ప్రాంతాలను గుర్తించి ప్రమాద తీవ్రతను బట్టి ప్రజలు రహదారి దాటకుండా జాగ్రత వహించాలి అని సూచించారు. ముఖ్యంగా వర్షాలకు కొత్త నీరు ప్రవహించే వాగులు, వంపులు, కాలువలు వంటి ప్రదేశాల్లో చేపలు పట్టే జాలర్లు, యువకులు సాహసాలు చేస్తారని, విద్యార్థులు ఆయా ప్రాంతాలను చూడడానికి వస్తుంటారన్నారు. అలాంటప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కు వగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు పడుతున్న సమ యంలో పాత ఇళ్లు కూలిపోయే అవకాశం ఉందని వాటిని గుర్తించి ముందస్తు జాగర్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.. గ్రామ సర్పంచులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పంచాయితీ సిబ్బంది రాత్రి సమయాల్లో సైతం చురుకుగా ఉండాలని సూచించారు. రూరల్ ఎస్సు మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండి చెట్లు, కరెంటు స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల దగ్గర ఉండదని సూచించారు. అత్యవసరమైతే డయల్ 100 కాల్ చేయవలసిందిగా తెలియజేశారు.

# వినాయక గుడి వద్ద అన్నదానం



**మధిర, జూలై 26(మనం న్యూస్):** మధిర మెయిన్ రోడ్ లోని వినాయక గుడి వద్ద అన్నదాన కార్యక్రమంలో భాగంగా కొత్తూరు గురు వెంకటేశ్వర్లు, శ్రీదేవి ల కుమార్తె కొత్తూరు పరిణితి పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మదిర వినాయక ఆలయ కమిటీ చైర్మన్ బాణాల శంకరాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాలలో కల్లా అన్నదానం మిన్న అని అన్నదాతలను అభినందించారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు పెళ్లిరోజు సందర్భంగా వినాయకుని గుడి వద్ద అన్నదాన కార్యక్రమంనకు ఆర్థిక సహకారం అందించవలసినది గా కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి రవి శాస్త్రి, వలిశెట్టి శ్రీనివాసరావు, కోనా జగదీష్ గురు వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పరిణితి, నాగేశ్వరరావు, బాలు, గౌస్, కృష్ణవేణి పాల్గొన్నారు.

# కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలాజీ నాయక్



**ఏన్కూరు, జూలై 26(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భానోత్ బాలాజీ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అవినాష్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా బుధవారం హైదరాబాదులో నియామక పత్రాన్ని అందజేశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బానోత్ బాలాజీ నియమితులవడం ఎంతో హర్షనియమని ఆల్ ఇండియా బంజారా సంఘం వైరా అధ్యక్షులు, రేపల్లెవాడ మాజీ సర్పంచ్ మాలోత్ నరసింహారావు అన్నారు. దీంతో పలువురు నాయకులు బాలాజీ నాయక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నాయకులు



**మధిర,జూలై26(మనం న్యూస్):** మధిర రూరల్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎండి ఉఫాతుల్ రఫీని సిపిఐ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చావా మురళీకృష్ణ, పేరుమలపల్లి ప్రకాష్ రావు, ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ,సిపిఐ మధిర మండల కార్యవర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మల్లారం వార్డ్ మెంబర్ షేక్ నాగుల్ మీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు కొంగర నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల భిక్షాటన

**ముదిగొండ, జూలై 26(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత 21 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల లో పంచాయతీ సిబ్బంది మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు .కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులను బిక్షం ఎత్తుకునేలా చేసిందని పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి పనులు చేయించుకొని ప్రస్తుతం వారు చేస్తున్న సమ్మెను పట్టించుకోకుండా వారి న్యాయమైన డిమాండ్లను అంగీకరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారి న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చి వారికి న్యాయం చేయకపోతే రాబోవు రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇనప నాగేశ్వరరావు, చిక్కులు గురవయ్య , పల్లపాటి శ్రీకాంత్, పెద్ద మండవ సుబ్బారావు నాగేశ్వరరావు, కాసిం సాహెబ్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎంఎల్ఏ సండ్రపై కొండూరు అనుచిత వ్యాఖ్యలు

## ఖండించిన దళిత ప్రజాప్రతినిధులు



**సత్తుపల్లి టౌన్, జులై 26 (మనం న్యూస్):** బిఆర్ఎస్ పార్టీ బీఫామ్ తో గెలిచిన కౌన్సిలర్లను పక్కన కూర్చోబెట్టుకుని, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పార్టీ మారారని విమర్శించే నైతికత నీకు ఉందా అని కొండూరు సుధాకర్‌ను బిఆర్ఎస్‌కు చెందిన పలువురు దళిత ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. నిన్నమొన్నటివరకు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ప్రజా సమస్యలు తెలియని నీకు విమర్శించే స్థాయి లేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం లో ఉన్నప్పుడు ఎప్పుడు గుర్తుకు రానీ దళితులు ఎన్నికలు అనగానే గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఎన్నికలు ఉన్నా లేకపోయినా దళితులను కడుపులో పెట్టుకుని చూసుకునే నాయకుడు సండ్ర వెంకటవీరయ్య అని అన్నారు. ఆత్మగౌరవంతో ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న దళిత శాసనసభ్యునిపై ఒకరు రాసిచ్చిన స్క్రిప్టును చదివే నీకు స్వతహాగా దళిత బిడ్డగా సత్తుపల్లిలో రాజకీయం చేసే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంట ఎంత మంది దళిత నేతలున్నారు. ఎంతమంది దళితులు ఉన్నారో చెప్పే దమ్ముందా.? దళితులన్నా దళిత నేతలన్నా పొంగులేటికి ద్వేషం అని అన్నారు . ఎప్పుడు దళితులను రాజకీయంగా వాడుకున్నాడే తప్పా ఏ దళితుడుకి పిరికెడు అన్నం పెట్టిన పాపాన లేదు, తననే నమ్మి పదేండ్లు వెంట నడిచిన మట్టా దయానంద్ లాంటి దళితుడ్ని మోసం చేసిన చరిత్ర మీ పొంగులేటిది అని అన్నారు. అలాంటి నాయకుడు కింద తిరిగే నువ్వా మా సండ్ర గురించి మాట్లాడేది అని ప్రశ్నించారు. సండ్ర అంటే ప్రతి గడపలోనే కాదు ప్రతోక్కరి గుండెల్లో కొలువై ఉన్న అభిమాన నాయకుడని గుర్తు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గానికి సండ్ర రాకముందు ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉంది మీకండ్లకు కన్పించడం లేదా.. కంటి వెలుగులో ఉచితంగా చూస్తారు .. వెళ్ళి పరీక్షలు చేయించుకోండి అని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గానికి ఓ నర్సింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, 100 పడకల హాస్పిటల్, కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ, కల్లూరు ఇండోర్ స్టేడియం, కల్లూరు బస్ స్టాండ్, అంబేద్కర్ భవన్ , క్రిష్టియన్ భవన్, అంతర్గత, గ్రామాలను అనుసంధాన రోడ్లు వంటి 1000 కోట్ల అభివృద్ధి చేసిన ఘనత సండ్రది.. మీ అభిమాన నాయకుడు ఎంపీగా ఉండి కనీసం నాలుగు రూపాయల అభివృద్ధి అయిన చేశారా అని ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత ఊరిలోనే ఆయన ఎంతమంది దళితులకు న్యాయం చేసిండు.. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఎంత మంది దళితులకు న్యాయం చేసిండు అనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ల అద్దంకి అనిల్, గుండ్ర రఘు, సర్పంచు తడికమల్ల మంగమ్మ, విజయరావు,ఎంపీటీసీ కాకటి నిర్మల భారతి ప్రకాష్, కో ఆప్షన్ తడికమల్ల ప్రకాష్, నాయకులు మరోజు సురేష్, నడ్డి ఆనందరావు, రావూరి శ్రీను, మేకల నరసింహరావు తదితులున్నారు.


# మణిపూర్ ఘటనను నిరసిస్తూ సిఐటియు నిరసన



**సత్తుపల్లి టౌన్, జూలై 26 (మనం న్యూస్) :** స్థానిక సిఐటియు సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్ లో రాజ్యాంగ హక్కులను కాపాడటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడుల పై స్పందించని మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజనుల పై జరుగుతున్న దాడులు అత్యాచారాల పై మాట్లాడకుండా మౌనంగా ఉంటూ, దాడులను ఖండించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని విదేశీ పర్యటనలు చేయటం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే ఘటనలపై ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు, లేనియెడల సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో వినయ్, రవి, వెంకటేశ్వరావు ,రహీం, నబి, వెంకట్రావు, కృష్ణా, నాగేశ్వరావు, నాగరాజు ,పుల్లారావు, శ్రీను, రాంబాబు ,విష్ణు, మనోజ్,వరుణ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్



**సత్తుపల్లి టౌన్, జులై 26 (మనం న్యూస్):** రెండు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో స్కూల్స్ కు సెలవులు ఇచ్చిన కారణంగా మీ ఇంట్లో ఉన్న పిల్లలను మీ ఇంట్లోనే ఉంచండి, ఎవరిని చెరువుల వద్దకు పంపకండి. భారీ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలకు కరెంటు వచ్చే అవకాశం ఉన్నందువలన విద్యుత్ స్తంభాలను ఎవరు ముట్టుకోకుండా ఉండండి. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల లో ప్రజలు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చైర్మన్ సూచించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలాగా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం జిల్లా ని రెడ్ జోన్ గా ప్రకటించి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించిన నేపథ్యంలో సత్తుపల్లి పట్టణ ప్రజలు ప్రదానం గా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



## ఓటు హక్కు వినియోగంపై అవగాహన

**సత్తుపల్లి టౌన్, జులై 26 ( మనం న్యూస్ )** :సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యంలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అనే దాని పై అవగాహన కల్పించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందికి పారిశుద్ధ్య కార్మికులకు ఈవీఎం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య గ మున్సిపల్ కమిషనర్ సుజాత, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్‌కు పంచాయతీ కార్మికులు వినతి



**దమ్మపేట, జూలై 26(మనం న్యూస్) :** మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల 21వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముట్టడి, అనంతరం డిప్యూటీ తాసిల్దార్ భావనకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు గొర్రెపాటి బసవయ్య, పెంకి ప్రభాకర్ మాట్లాడుతూ 21 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమ గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదని అన్నారు. రేపు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమల రాంబాబు .మహేష్. సింగ్ .ఉదయ్. అన్నవరం .జయలక్ష్మి .నరసమ్మ. చిన్న .సహదేవుడు .గోదా నాగేశ్వరరావు .చెన్నారావు. తదితర గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

## సమస్య గురించి చెప్పినా పట్టించుకోని సర్పంచ్



**అశ్వారావుపేట టౌన్, జూలై 26(మనం న్యూస్) :** అశ్వారావుపేట మండలంలో కురుస్తున్న వర్షాలకు వినాయకపురం గవర్నమెంట్ స్కూల్ దగ్గర నూతనంగా కొత్త పంచాయతీ ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ ఆఫీస్ నిర్మాణం కోసం మట్టి తోలారు. గతంలో పైనుండి వచ్చే వాటర్ దిగువకు సాఫీగా వెళ్ళిపోయాయి. ఇప్పుడు వెళ్లే పరిస్థితి లేదు. పంచాయతి ఆఫీస్ ఏర్పాటు కొరకు మట్టి తోలడం వల్ల పైనుండి వచ్చే వాటర్ దిగువకి వెళ్లే లాగా సదుపాయాలు గ్రామ పంచాయతీ వాళ్ళు ఏర్పాటు చేయలేదు. దీంతో నీరు ఇళ్లల్లోకి వచ్చి చాలా ఇబ్బందిగా ఉంది. గవర్నమెంట్ స్కూలు సముద్రాన్ని తలపిస్తుంది. గ్రామస్తులు చెప్పినా గ్రామపంచాయతీ వినాయకపురం సర్పంచ్ పట్టించుకోవడం లేదు. నీరు నిల్వ వుండి దోమలు తయారయ్యి జబ్బులు బారిన పడుతున్నాం. మా బాధను పట్టించుకునే నాధులే లేరని, ఎంఎల్ఏ అయినా పట్టించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పంచాయతీ కార్మికులకు అన్నదానం



**అశ్వారావుపేట టౌన్, జూలై 26(మనం న్యూస్) :** పంచాయతీ కార్మికుల సమ్మె 21వ రోజు చేరడంతో అశ్వరావుపేట సీనియర్ ఫోటోగ్రాఫర్ పసుపులేటి ఆదినారాయణ, ఆలపాటి రాము కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన సతీమణి గారి జ్ఞాపకార్థం ఆదినారాయణ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## మణిపూర్ ఘటనపై బీజేపీదే పూర్తి బాధ్యత



**కల్లూరు, జూలై 26(మనం న్యూస్):** మణిపూర్ లో జరిగిన ఆకృత్యాలపై బిజెపి వెంటనే స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని, మహిళలను అపహస్యంగా వెంటపడి హింసించి నగ్నంగా నడి వీధుల్లో ఊరేగించడానికి బిజెపి ప్రభుత్వం బాధ్యత వహిచాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడిపల్లి కవిత డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వెంటనే మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని, ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేసి సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరావు మాట్లాడుతూ గిరిజనులపై దళితులపై గౌరవం ఉందని చెప్పుకునే బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఎక్కడికి పోయిందని, ఈ సంఘటన యావత్తు భారతదేశానికి ఒక అవమానమని, ఇలాంటి చర్యలకు పాల్పడే నిందితులని వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు జన్నారెడ్డి, నరసింహారెడ్డి, కర్నాటి అప్పిరెడ్డి, కర్నాటి సత్యనారాయణ రెడ్డి, దరవత్ శివాజీ ,మడిపల్లి రవి, మల్లాది బలరాం, పార్టీ కార్యకర్తలు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 1న వాహనాల వేలం

**సత్తుపల్లి టౌన్, జులై 26 (మనం న్యూస్):** సత్తుపల్లి పరిధిలో, వివిధ కేసులలో పట్టుబడిన వాహనములు బహిరంగ వేలం ఆగస్టు ఒకటో తారీకు ఉదయం 11.00 గం. లకు సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్లో ఉంటుందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వి . రాజశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సి టి 100 మోటార్ సైకిల్, ఎఫ్ జడ్ – మోటార్ సైకిల్, మహేంద్రా పాసెంజర్ ఆటో , జస్ట్ – మోటార్ కార్ వేలం నిర్వహించబడునని తెలిపారు.

# విద్యా బోధనలో నాణ్యతే ప్రాధాన్యం

## – జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 26 (మనంప్రతినిధి) :** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన , నాణ్యమైన విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు . బుధవారం ఐడిఓసి కార్యాలయంలో విద్యా , మైనార్టీ , ఎస్సీ అభివృద్ధి , గిరిజన , బిసి సంక్షేమ శాఖల అధికారులతో ప్రభుత్వ పాఠశాలు , సంక్షేమ శాఖల పాఠశాలల్లో విద్యాబోదనపై సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిల్లో అన్ని పాఠశాలలను పరిశీలన చేయాలని చెప్పారు . ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలున్నాయో గుర్తించి నివేదికలు అందచేయాలని చెప్పారు . ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ప్రభుత్వం గత సంవత్సరం 246 ప్రాధమిక , 55 ప్రాధమికోన్నత , 67 ఉన్నత పాఠశాలలను మన ఊరు ' మన బడి కార్యక్రమంలో ఎంపిక చేసి మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు . మన ఊరు – మన బడి కార్యక్రమంలో చేపట్టిన 368 పాఠశాలల పురోగతిపై పర్యవేక్షణ ఇంజనీరింగ్ శాఖలు , విద్యాశాఖతో సమీక్షా సమావేశం నిర్వహిస్తానని సమగ్ర నివేదికలు అందచేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు . ఏఏ శాఖకు ఎన్ని పాఠశాలలు పర్యవేక్షణకు అప్పగించారు , పనుల పురోగతి తెలియచేయాలని పేర్కొన్నారు . ఈ విద్యాసంవత్సరం 1 నుండి 5 వ తరగతి వరకు ఇంగ్లీషు మాధ్యమం అమల్లోకి వచ్చినందున ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు . ఆంగ్ల మాధ్యమంతో విద్యార్థులు , ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకూడదని , ద్వి భాషా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు . విద్యార్థుల్లో కనీస భాషా మరియు గణిత సామర్థ్యా లను పెంపొందించ డానికి తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు . జిల్లాలోని 965 పాఠశాలల్లో 1 నుండి 5 వ తరగతి చదువుతున్న 38110 మంది విద్యార్థులకు కనీస సామర్థ్యాలు పెంచడానికి కార్యక్రమాలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు . ఈ విద్యాసంవత్సరం 72548 మంది విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు . అలాగే 47698 మంది విద్యార్థులకు 290205 నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు చెప్పారు . విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంపొందిం చేందుకు 154 ప్రాథమిక పాఠశాలల్లో రీడింగ్ రూములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు . ఈ సందర్భంగా విద్యా , సంక్షేమ శాఖ అధికారులు వారి వారి పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలలు , సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులు హాజరు , నిర్వహణ తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు . ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ , గురుకుల ఆర్సీఓ డేవిడ్జు , మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు , ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య , బిసి సంక్షేమ అధికారి ఇందిర , బిసి గురుకుల అధికారి జ్యోతి , ఎస్సీ గురుకుల కో ఆర్డినేటర్ వెకంటేశ్వరావు , మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# మానవత్వం చాటుకున్న వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు పల్లపు

## పేద వడ్డెర కులస్థులకు 3క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26 (మనంప్రతినిధి) :** కొత్తగూడెం నియోజకవర్గం వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు మానవత్వం చాటుకున్నారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా రామవరం, గాంధీ కాలనీ, పెనగడప, బాలి కుంట, అయన్నపాలెం, చంద్రుగొండ, బెండలపాడు, రావికంపాడు, దామరచర్ల, గ్రామాలలో ఉన్న పేద వడ్డెర కులస్థులకు నిత్యావసర సరుకులు, 3 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ అనే మార్గంలో ముందుకు వెళ్లడం జరుగుతోందని, ఆకాలంగా కురుస్తున్న వర్షాలకు పేదలు ఏ పనులు లేక ఇంటిలో ఉంటూ, బ్రతుకు తెరువు లేక, వారి పరిస్థితి దయనీయంగా మారిందని, ఈ విషయం తెలిసిన వెంటనే తన యొక్క బాధ్యతగా స్పందించి వారికి నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశానని, గతంలో కూడా చాలా మంది పేదలకు సహాయం చేశానని, ,ప్రభుత్వం కూడా నిత్యం పనులకు వెళితే కానీ జీవనం సాగని కుటుంబాల గురించి ఆలోచన చేయాలని, తక్షణం వారిని ప్రభుత్వం ఆదుకొని వారికి ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించాలని జిల్లా అధ్యక్షునిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆకాలంగా కురుస్తున్న వర్షాలకు పేద ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఒక రోజు పని ఉంటే రెండవ రోజు పస్తులు ఉండే పరిస్థితి ఉందని, రాబోయే రోజుల్లో కూడా తాను పేదలకు,పేద వడ్డెర కులస్థులకు థనకు చాతనైన సహాయం చేస్తానని పల్లపు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో:రాష్ట్ర నాయకులు రాయల చందరరావు,శవడ్డెర సంఘం జిల్లా నాయకులు తేపర్ల దుర్గారావు, బొదస్ కనక రాజు, కుంచెం వెంకటేష్, గోగుల ప్రేమ్ కుమార్, కుంచెం కుమారస్వామి, ఇడగోటి వెంకట రాములు, చెట్టి రాజు, కుంచెం కసి రాములు, సత్యం, దండుగుల పుల్లారావు మరియు వడ్డెర కులస్థులు పాల్గొన్నారు.

# బదిలీ అధికారికి ఆత్మీయ వీడ్కోలు

**ఇల్లందు, జూలై 26 (మనం న్యూస్):** ఇల్లందు ఏరియా లోని జె.కె ఉపరితల గని నందు పనిచేసి బదిలీ పై రామగుండం–3 ఏరియాకు వెళుతున్న డి.వై.పి.యం జి.శ్రీహరి ని ఏరియా పర్సనల్ విభాగం నందు శాలువా జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇల్లందు ఏరియా లో చాల కాలం వారు చేసిన సేవలు మరువలేనివని, మంచి వ్యాఖ్యాత, అలాగే పనిలో నీతి గా వ్యవహరించి అంకితభావంతో పని చేసి అందరి మన్ననలు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్) జీవి.మోహనరావు,సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, క్లారికల్ స్టాఫ్ రవి, లక్ష్మినారయణ, వీరన్న, వేణు, రాకేశ్, సాంబయ్య, కిశోర్, రజిని, మంగ, అమూల్య పాల్గొన్నారు.,.



# వర్షానికి కూలిన ప్రహరీ

## విద్యుత్ పోల్స్ ను పరిశీలించిన ఆర్ఐ



**ఇల్లందు, జూలై 26 (మనం న్యూస్):** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ బస్తీ ఏరియా 20 వ వార్డుకు చెందిన కాసాని హరిప్రసాద్ ఇంటి నెంబర్ 5–4–125/2 గల ఇంటి ప్రహరీ గోడ కూలడంతో సమీపంలో గల 4 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఘటనా స్థలాన్ని వార్డు కౌన్సిలర్ మొగిలి లక్ష్మి పరిశీలించి స్థానిక తాసిల్దార్ కు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఆర్ ఐ పరిశీలించి విచారణ జరిపారు. జరిగిన నష్టాన్ని అంచనావేస్తూ తహశీల్దార్‌కు రిపోర్ట్ చేయనున్నట్లు తెలిపారు. గోడకూలి ఒక స్తంభం పై పడటంతో ఐదు స్తంభాలు విరిగిపోయాయి. అదృష్టం ఆ పరిసర ప్రాంతాల్లో వర్షం కారణంగా ఎవరూ లేక ప్రాణ నష్టం జరగలేదు. విద్యుత్ లైన్ వారికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో లైన్ కట్ చేయడంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మొగిలి లక్ష్మి స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# ఎస్ఓ టు డైరక్టర్ (పా) ఏజేఎం మురళీధరరావును సన్మానించిన డైరక్టర్(పా)



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 26 (మనంప్రతినిధి) :** సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎస్ఓ టు డైరక్టర్ (పా) గా పనిచేస్తూ యూపిఎస్సి నిర్వహించిన ముఖా ముఖిలో ఎంపికై ఈఎస్ఐసి (ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) సంస్థకు అడిషనల్ కమిషనర్ మరియు రీజనల్ డైరక్టర్, హర్యానాగా డెప్యుటేషన్ పై 3 సంవత్సరాల కాలపరిమితికి వెళ్తున్న సంధర్భంలో బుధవారము డైరక్టర్(పా) ఛాంబర్ లో సింగరేణి డైరక్టర్ (పా) ఎన్.బలరాం, ఎస్ఓ టు డైరక్టర్ (పా) ఏజేఎం మురళీధరరావును, శాలువా మరియు జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణి డైరక్టర్ (పా) ఎన్.బలరాం, ఐఆర్ఎస్ మాట్లాడుతూ, ఈఎస్ఐసి సంస్థకు అడిషనల్ కమిషనర్ మరియు రీజనల్ డైరక్టర్(హర్యానా) గా ఎంపిక కావటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఏజేఎం మురళీధరరావును అభినంధించారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్సి కే.బసవయ్య, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం బి.హనుమంత రావు, జిఎం(హెచ్ఆర్డి) బిహెచ్.వేంకటేశ్వర రావు, చీఫ్ ఈఈ సెల్ కవితా నాయుడు, ఏజిఎం(పర్సనల్) కే.శ్రీనివాస రావు, ఎస్ఓటు డైరక్టర్ ఫైనాన్స్ కే.కవిత, డిజిఎం(పర్సనల్) ధన్ పాల్ శ్రీనివాస్, డివై.సిఎంఓ జి.సునీల, మెడికల్ సూపరింటెండెంట్. టి.ఆనంద్ సుధాకర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి సెక్యూరిటీ విభాగంపై సమీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26 (మనంప్రతినిధి) :** బి.ఆర్. దీక్షితులు, జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) ఆధ్వర్యంలో జి.యం. (సెక్యూరిటీ) కార్యాలయమునందు అన్ని ఏరియాల సెక్యూరిటీ విభాగ అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యన్. బలరాం, సంచాలకులు (ఫైనాన్స్ అండ్ పా) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో దొంగతనాలను అరికట్టేందుకు తీసుకొనవలసిన చర్యలు, కంపెనీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చేపట్టే చర్యలు, కంపెనీ క్వార్టర్లు అక్రమ ఆక్రమణకు గురైన, ఇతరులకు అద్దె ఇచ్చిన వాటికి సంబంధించిన సర్వే, అన్ని ఏరియాలలోని మ్యాన్ పవర్ గురించి, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది వృత్తి నైపుణ్యం, వారి జీతభత్యాలు సకాలములో చెల్లింపు మరియు సంబంధిత రికార్డుల నిర్వహణ, ఏరియాలలో మొబైల్ టాస్క్ ఫోర్స్ టీమ్, ఇంటెలిజెన్స్ సిబ్బంది. పనితీరు మొదలగు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమములో సి.హెచ్. శశిధర్ రాజు, చీఫ్ సెక్యూరిటీ అధికారి, జె. వేణుమాధవ్, ఎస్వో టూ జి.యం. (సెక్యూరిటీ), యం.డి. జాకీర్ హుస్సేన్, కార్పోరేట్ సీనియర్ సెక్యూరిటీ అధికారి, అన్ని ఏరియాల సెక్యూరిటీ విభాగ అధిపతులు పాల్గొన్నారు.



# నిండుగా చెరువులు

**ఇల్లందు జూలై 26 (మనం న్యూస్) :** ఇల్లందులపాడు, కాళీమాత గుడి ప్రాంతంలో గల మంచినీటి చెరువు సరైన వర్షం ఒకటి పడితే బుధవారం రాత్రిచెరువు నుండి మత్తడి పడే అవకాశం ఉంది.. అని వార్డ్ కౌన్సిలర్ కటకం పద్మావతి స్థానికులు పేర్కొన్నారు. వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి.



# ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేసే అధిక లాభాలు : రేగా కాంతారావు

**కరకగూడెం, జూలై 26 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం లోని సమత్ భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుర్నవల్లి గ్రామంలోని తన స్వగ్రామంలో తన పొలంలో సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, వ్యవసాయ శాఖ అధికారులు హార్టికల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పుష్కలంగా సాగు నీరు, ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భీమా, పలు రైతుసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

**ప్రభుత్వ రాయితీలు – ప్రోత్సాహం..**

మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి, వరి కి ప్రత్యామ్నాయంగా ఆయిల్ సాగు చేయాలి. ఆయిల్ పంప్ పంట సాగు చేయడం వలన ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం పొందవచ్చు- తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పంట సాగు కు మొక్కలు, యాజమాన్యం ,బిందు సేద్య పరికరాలు పై ఒక ఎకరానికి 50 వేల వరకు రాయితీ అందిస్తుంది. మార్కెట్లో వంటనూనెల వినియోగం ఎక్కువగా ఉంది. వంట నూనెలను విదేశాల నుండి లక్ష కోట్ల రూపాయల పైగా ఖర్చు చేసి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. కనుక వంట నూనెలలో స్వయం సమృద్ధి సాధించుటకు డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి. స్వయంగా 11 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటడం జరిగింది అన్నారు, మొదటి మూడు



సంవత్సరాలు అంతర పంటలుగా అన్ని రకాల కూరగాయలు, అపరాలు, నూనె గింజలు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చని తద్వారా అదనపు ఆదాయం వస్తుంది అని తెలిపినారు.మొక్కలు నాటి వెనువెంటనే ఆధార్ తో లింక్ అయినా రన్నింగ్ బ్యాంక్ ఖాతాకు ఎకరాకు రూ. 4200/-రూపాయలు నాలుగు సంవత్సరాల వరకు జమ చేయబడును. కనుక జిల్లా రైతాంగం ఆయిల్ ఫామ్ సాగవైపు మొగ్గుచూపి ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను ఉపయోగించుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మణుగూరు వ్యవసాయ సహాయ సంచాలకులు తాతారావు , ఆయిల్ ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ , జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి, జినుగు. మరియన్న, ఉద్యాన అధికారి ఆర్. శాంతి ప్రియ, ఆయిల్ ఫెడ్ అధికార్లు.డీ అప్పారావు,.పి.రాజేశ్ రెడ్డి, రైతులు శ్రీ రావుల కనకయ్య, ఎలిపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏ ఈ ఓ లు అనిల్, ప్రశాంత్ లు పాల్గొన్నారు.

# కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న పాకాల



**భద్రాచలం, జూలై 26( మనం న్యూస్):** తిరుపతి కలియుగ దైవం వైకుంఠ స్వామి వెంకటేశ్వర స్వామి ని బుధవారం నాడు భద్రాచలం సామాజిక సేవకులు ,ఐటిసి కాంట్రాక్టర్, పాకాల దుర్గా ప్రసాద్ , లక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరినట్లు పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు.

# విద్యా వాలంటీర్ల వేతన బకాయిలు చెల్లించాలి

## టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు



**ఆళ్లపల్లి, జూలై 26 (మనం న్యూస్):** మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేసిన విద్యా వాలంటీర్ల మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యా విద్యా వాలంటీర్ల మూడు నెలల బకాయి వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తూ సమాన వేతనం పొందలేకపోయినా విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం కు విద్యా వాలంటిరీలు ఎనలేని కృషి చేస్తున్నారని వారికి వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యా వాలంటీర్ల వేతనాలు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉన్నచోట విద్యా వాలంటీర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

# దంచి కొడుతున్న వాన...

## పొంగిపొర్లుతున్న వాగులు వంకలు..

**కరకగూడెం, జులై 26 (మనం న్యూస్):** కరకగూడెం మండల పరిధిలో మంగళవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు భారీగా వరద నీరు చేరుకుంటుంది. ప్రభుత్వ ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు ఇంటి దగ్గర ఉన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. బట్టుపల్లి కరకగూడెం మధ్య ఉన్న బూడిద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది, కరకగూడెం తిరుమల మధ్య ఉన్న ప్రధాన రోడ్డుపై బుర్రికుంట కప్పల కుంట చెరువులు అలుగులు పడడంతో ప్రధాన రహదారి పైనుండి మీరు ప్రవహిస్తుంది. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని అధికారులు సూచించారు. రానున్న రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనంతరం పద్మాపురం మధ్య రహదారిపై మీరు ప్రవహిస్తున్నాయి, పడిగాపురం మోతే గ్రామాలలో ఉన్న పెద్దవాగు ప్రమాదకరంగా ఉంది. మండల వ్యాప్తంగా ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజల వస్తువులు పడుతున్నారు.






# ఘనంగా పోదెం మధు చంద్ర జన్మదిన వేడుకలు



**మణుగూరు, జూలై 26 (మనం న్యూస్) :** భద్రాచలం ఎమ్మెల్యే పొదెం. వీరయ్య కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొదెం మధు చంద్ర కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తూ మణుగూరు మండల అధ్యక్షులు పీరీనాకి నవీన్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనియోజకవర్గ కో – ఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు , పినపాక నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోర్స ఆనంద్, మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు యస్కే లతీఫ్, గుండాల శివ, కలబోయిన నాగరాజు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికులను సన్మానించిన లయన్స్ క్లబ్

**భద్రాచలం, జూలై 26( మనం న్యూస్) :** లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో స్థానిక రెడ్ క్రాస్ బిల్డింగ్ లో జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ కార్గిల్ విక్టరీ డే సందర్భంగా ఆర్మీలో పనిచేసిన, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర జవానులకు బి వెంకన్న యాదవ్, జకరయ్య బెల్లంకొండ రమేష్, ఎస్కే నభి బెన్వర్ ,సైనిక వెల్ఫేర్ బోర్డు మెంబర్ తిప్పన సిద్ధులు కు లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం చైర్మన్ తిప్పల సిద్ధులు, క్లబ్ అధ్యక్షులు భీమవరపు వెంకటరెడ్డి మాట్లాడుతూ వీర జవానులు మరణిస్తాను అని తెలిసిన ఒక అడుగు ముందుకేసి కార్గిల్ యుద్ధంలో విరోచిత పోరాటం చేసి విజయం సాధించిన జవానులందరికీ జేజేలు తెలిపారు. భారతదేశ యువత ఆర్మీలో పాల్గొనటానికి ముందుకు రావాలని తెలిపారు. యుద్ధ వాతావరణం లేకుండా శాంతియుత చర్చల ద్వారా సమాజ శ్రేయస్సు కోసం భవితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ వై సూర్యనారాయణ క్లబ్ కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి జి భరత్ కుమార్, ఫాస్ట్ ప్రెసిడెంట్ సోమ రౌతు శ్రీనివాసరావు,గట్టు వెంకటాచార్యులు,బిల్లి పెళ్లి రంగారెడ్డి, బోనాల సూర్యనారాయణ, ఎం సిద్ధారెడ్డి,ఉమా శంకర్ నాయుడు, కొల్లు వెంకటరెడ్డి, ఏ నరసింహాచారి,రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఎంపీపీ

**కరకగూడెం జులై 26 (మనం న్యూస్):** రోజురోజుకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి అయితేనే,తప్ప బయటికి రావాలని సూచించారు. ఎవరు కూడా వాగులు, వర్రెలు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, కరెంట్ స్తంభాలను ముట్టుకొవద్దని,



ఇంట్లో ఉన్నప్పుడు కూడా కరెంటు వైర్లు,స్విచ్ లను తడి చేతులతో వెయ్యారాదని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం జీవనం స్తంభించిందని ఆమె తెలిపారు. చెరువులకు అలుగులు పడడంతో వర్ధ ఉధృతి పెరిగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని గ్రామాలలో నీళ్లు నిలవకుండా నీరు వెళ్లిపోయే విధంగా కాలువల తీయాలని ఆమె కోరారు. రాబోయే రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలను కోరారు.

# మండల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ రాజ్ కుమార్ సూచన**

**బూర్గంపహాడ్, జూలై 26 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలేం, ఇరవెండి, మోతే, సారపాక గోదావరి



ప్రభావిత ప్రాంతాలను అదే విధంగా ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఉన్న కిన్నెరసాని వాగు ప్రవాహాన్ని ఎస్ఐ రాజ్ కుమార్ పరిశీలించారు. ప్రజలు ఎవరు ఈ సమీపం వైపు రావద్దు అని సూచించారు. మూడు రోజుల నుండి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వీధుల్లో నుండి ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, ఇంట్లో పిల్లలను సైతం బయటకి రానీయ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు .ఎటువంటి ఇబ్బందులూ ఉన్నా 100కి, స్టేషన్ ఆఫీసర్ కి (8712682055) గానీ కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి



**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా నియంత్రించేందుకు జిల్లా స్థాయి నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల సరఫరా మూలాలకు సంబంధించిన అన్ని అనుసంధానాలను గుర్తించి కట్టడి చేయడం వల్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి వీలవుతుందని అన్నారు. ఇందుకు అధికారుల సమిష్టి కృషి, స్థానిక ప్రజల మధ్య సమన్వయం ఉండాలని ఆయన అన్నారు. జిల్లా స్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా మాదక ద్రవ్యాల రవాణాపై స్పష్టమైన సమాచారం అందుతుందన్నారు. దీని ఆధారంగా సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడానికి వీలవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం పెరిగితే ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారుతోందన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి విద్యాలయాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు అలవాటు పడిన వారిని రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకొని రావాలన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ, సరదా కోసం సిగరెట్తో మొదలవుతున్న యువత వ్యసనాలు, మద్యం, ఆ తరువాత మాదక ద్రవ్యాల వరకు వెళ్తుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో సమాజంపై తీవ్ర దుష్ప్రబావం చూపుతుందని అన్నారు. మత్తుకు బానిసగా మారిన యువతను టార్గెట్ చేసుకున్న గంజాయి మాఫియా, చివరకు వారినే ఏజెంట్లుగా మార్చి వ్యాపారాన్ని చాపకింద నీరులా విస్తరింపజేయ ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై వారు సామాజిక సంబంధాలను సైతం కోల్పోతున్నారని, తరచూ ఉద్రేకానికి లోనవుతూ, నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డిసిపి ఏ.ఎస్.సి. బోస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, ఏ.సి.పిలు ప్రసన్నకుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలి : కలెక్టర్



**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** ఎన్నికల విధుల్లో నోడల్ అధికారులు, తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఐడిఓసి లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో సమావేశమై, వారి విధుల సన్నాహాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే సాధారణ ఎన్నికలకు 16 అంశాలపై నోడల్ అధికారుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మానవ వనరుల, శిక్షణ, రవాణా, ఐటి, సైబర్ భద్రత, స్వీప్, జిల్లా భద్రత ప్రణాళిక, ఇవిఎం, మోడల్ కోడ్ కండక్ట్, ఖర్చు పర్యవేక్షణ, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా, సమాచార కార్యాచరణ, ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ హెల్ప్ లైన్, ఎన్నికల పరిశీలకులు విషయమై నోడల్ అధికారుల నియామకం చేసినట్లు ఆయన అన్నారు. ఎన్నికల నిర్వహణకు సరిపోను సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. శిక్షణ కు ప్రదేశం ఎంపిక చేయాలని, ప్రొజెక్టర్, ఇవిఎం, కావాల్సిన సదుపాయాల కల్పన చేయాలన్నారు. ఇవిఎం, అధికారులు, పర్యవేక్షణ బృందాల రవాణాకు కావాల్సిన వాహనాలు సిద్ధపర్చుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలన్నారు. వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత గురించి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ని ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైనికుల స్ఫూర్తితో విశిష్ట సేవలందించాలి

## జవాన్లకు కలెక్టర్, సీపి నివాళి



**ఖమ్మం, జూలై 26(మనం బ్యూరో) :** సైనికుల స్ఫూర్తితో ఎంచుకున్న రంగంలో విశిష్ట సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కార్గిల్ విజయ్ దివస్ ను పురస్కరించుకుని అమర్ జవాన్ స్మృతిచిహ్నం వద్ద కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత జవాన్లకు కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధ విజయం మన దేశ సైన్యం యొక్క విజయం, శౌర్యం, కీర్తికి చిహ్నమని అన్నారు. ప్రతికూల వాతావరణంలో మన సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ రక్షణ చేశారన్నారు. సైనిక సంక్షేమ భవన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభించుకున్నట్లు, వచ్చే సంవత్సరం లోగా మొదటి ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేసుకొని, భవనాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. అమర్ జవాన్ స్మృతి చిహ్నం పూర్తి చేసుకున్నామన్నారు. అమర సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధికి, పురోగతికి మనమంతా కృషి చేయాలన్నారు. మనమంతా ఇక్కడ భద్రంగా, స్వేచ్ఛగా, సురక్షితంగా ఉన్నామంటే, అది సరిహద్దుల్లో సైనికుల వల్లేనని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా అమర సైనికుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, కల్నల్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఫ్రాన్సిస్, కార్యదర్శి యుగంధర్, అమర సైనికుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజె ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం



**భద్రాచలం, జూలై 26 (మనం న్యూస్) :** అర్హులైన జర్నలిస్ట్ లు అందరికి ఇంటి స్థలాలు కేటాయించాలని, జర్నలిస్ట్ ల కుటుంబాలకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ.. టీ యూ డబ్ల్యూ జె (ఐజెయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు బి. వి. రమణారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జర్నలిస్ట్ ల పాత్ర ఎనలేనిదని, ఈ విషయం సాక్షాత్తు కెసిఆర్ చెప్పడం జరిగిందని, అయినా ఇంత వరకు జర్నలిస్టుకు ఏ విధమైన న్యాయం ప్రభుత్వం చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొబగాపు ఆనంద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు తోకల నాగేశ్వరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పోకల శ్రీనివాస్, జిల్లా నాయకులు పిల్లి రాజు, దాసరి క్రాంతి కుమార్, లక్ష్మి నరసింహ నాయుడు, జగన్ పాల్గొన్నారు.

# మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

## – సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం



**ఏన్కూరు, జూలై 26(మనం న్యూస్):** మణిపూర్ లో మారణహోమానికి కారణమైన బిజెపి రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైరా నియోజకవర్గం ఇంచార్జ్ భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీమండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఆదివాసి గిరిజనులపై క్రూరంగా అక్కడికి రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మైతి వర్గాన్ని కొమ్ముకాస్తూ దుర్మార్గాపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. దేశంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీ చేస్తామని, అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరావు, మండల నాయకులు బానోతు బాలాజీ, ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, షేక్ జానీ, రేపల్లెవాడ ఎంపిటిసి భూక్యా లక్ష్మానాయక్, తమ్మినేని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లికి మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ప్రత్యేక పూజలు



**వైరా, జూలై 26(మనం న్యూస్) :** నియోజకవర్గ కేంద్రమైన వైరాలోని వైరా రిజర్వాయర్ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవటంతో వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ భానోతు చంద్రావతి వైరా రిజర్వాయర్ బతుకమ్మ ఘాట్ వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళ సోదరీమణులతో గంగమ్మ కు పసుపు కుంకుమ నదిహారతిని ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో సిరిసంపదలతో ఉండాలని వైరా రిజర్వాయర్ ఆయకట్టు రైతులు సుభిక్షంగా ఉండాలని సాగునీరు రెండు పంటలకు అందాలని ప్రార్థించారు అనంతరం వైరా బస్టాండ్ సమీపంలో పలువురు మహిళలతో టీ తాగుతూ చిట్ చాట్ చేశారు వారి వెంట తెలంగాణ మలిదశ ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు మందడపు శంకర్రావు హనుమాయమ్మ వాసవి నాళ్ల మాధవి ఉన్నారు.

# విలేకరులపై కేసు కొట్టివేత

**తిరుమలాయపాలెం, జూలై 26 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండల పత్రికా విలేకరులపై గత సంవత్సరం12/12/2022 న పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. మైనర్ బాలుడు తో పెట్రోల్ కొట్టిస్తున్నారని ప్రశ్నించిన పత్రికా విలేకరులు పోలే పొంగు వెంకన్న, కామల్ల వీరయ్య, వై. నాగరాజు లు డబ్బులు డిమాండ్ చేసి బెదిరిస్తున్నారని పిండిప్రోలు హెచ్ పి పెట్రోల్ బంక్ యాజమాన్యం పెట్టిన కేసును బుధవారం న్యాయస్థానంలో కేసు కొట్టివేశారు. పత్రికా విలేకరుల తరఫున న్యాయవాది బాతిక. అనిల్ కుమార్, కేసుకు సంబంధించిన సాక్షులను ప్రశ్నించి వాదనలు వినిపించిన మీదట నేరం మోపబడిన కేసుకు సంబంధించి సరైన ఆధారాలు లేవని ఖమ్మం జిల్లా గౌరవ న్యాయస్థానం పోలెపొంగు వెంకన్న, కామల్ల వీరయ్య, ఏడెల్లి నాగరాజు లపై కేసు కొట్టి వేస్తున్నట్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# వరద ముప్పును పరిశీలించిన కమిషనర్, ఛైర్‌పర్సన్

**మధిర,జూలై26(మనం న్యూస్):** మధిర పట్టణంలోనిశివాలయం వద్ద ఉధృతం గా ప్రవహిస్తున్న వైరా ఏటిని మరియు రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద వరద నీరును బుధవారం కమీషనర్ అంబటి రమాదేవి,చైర్ పర్సన్ మొండితోక.లత పరిశీలించారు.



ఈ సందర్భంగామధిర లో కొన్ని రోజుల నుంచి ఎడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ముప్పు ప్రాంతాలలో మున్సిపల్ సిబ్బంది పగలు, రాత్రి తేడాలేకుండా అందుబాటులో ఉంటూ ప్రజలకు ఏటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చూసుకోవాలని తెలిపినారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్, బ్లూ కోర్ట్ కానిస్టేబుల్, మున్సిపాలిటీ సిబ్బంది, పాల్గొన్నారు

# పాలేరు రిజర్వాయర్ ను పరిశీలించిన రాంరెడ్డి శ్రీ చరణ్ రెడ్డి

**కూసుమంచి, జులై 26 (మనం న్యూస్) :** కూసుమంచి మండల పరిధిలోని పాలేరు రిజర్వాయర్ ను తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి శ్రీ చరణ్ రెడ్డి పరిశీలించారు, గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాలేరు జలాశయం



నిండడంతో అక్కడ ఉన్న పరిస్థితిని పరిశీలించడం కోసం పాలేరు నియోజకవర్గ బృందంతో వెళ్ళింది పరిసీలిలించినారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని ,అందుకు రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు , ప్రభుత్వం పాలేరు నియోజకవర్గంపై దృష్టి పెట్టి రిజర్వాయర్ పరిస్థితులు లోతట్టు ప్రాంత గ్రామాలపై ప్రభావం ఏమైనా ఉంటే ముందుగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు పాటించాలని కోరారు, ప్రభుత్వం తగు సహాయక చర్యలు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ,ఈ కార్యక్రమంలో పాలేరు రిజర్వాయర్ ను పరిశీలించిన తెలంగాణ యువజన కాంగ్రెస్ నాయకులు రిజర్వాయర్ లోతట్టు ప్రాంత గ్రామాలపై దృష్టి పెట్టాలి అని రాంరెడ్డి శ్రీ చరణ్ రెద్ది ప్రభుత్వాన్ని కోరారు.

# వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు

**కూసుమంచి, జూలై 26 (మనం న్యూస్) :** కూసుమంచి మండలంలోని వివిద ప్రాంతాల్లో ,పాలేరు జలాశయం పరివాహక ప్రాంతాల్లో ఎగువ నుండి వచ్చే వరద వాగులు, వంకల, నుండి వచ్చే వరద నీటితో నరసింహులగూడెం టు




కృష్ణాపురం, నరసింలగూడెం టు కొత్తూరు వాగులు పొంగి ప్రవహించడంతో అధికారులు రాకపోకుల ను నిలిపివేశారు. వరద ఉధృతిని సీఐ జితేందర్ రెడ్డి ,తహశీల్దార్ శకుంతల, ఎస్ఐ రమేష్ కుమార్, పరిశీలించారు.

# కంట్రోల్ రూమ్ ఏర్పాటు...

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి.. : తహశీల్దార్ ఉషా శారద..

**కరకగూడెం, జులై 26 (మనం న్యూస్):** కరకగూడెం మండల కేంద్ర పరిధిలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాలి పేరు, గోదావరి వరద ఉధృతంగా పెరుగుతున్న కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో తాసిల్దార్ కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. కంట్రోల్ రూమ్ లో ఆర్ ఐ హుస్సేన్ ,వీఆర్ఏ ప్రవీణ్ అందుబాటులో ఉంటారని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలిగిన ప్రమాదాలు జరిగిన



వర్షాలకు ఇల్లు కూలిపోయిన పై నెంబర్లకు 8309646728,887675162, సమాచారం అందించగలరు ఆమె కోరారు. పంచాయతీ అధికారులు నిత్యం ప్రజల అందుబాటులో ఉంటూ సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని కోరారు, గ్రామాల మధ్య రాకపోకలు ఇబ్బందిగా ఉంటే తక్షణమే పంచాయతీ అధికారులు గ్రామస్తులకు తెలియజేసి వాహనాలను అడ్డు పెట్టాలని ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు.

# ముంపు ప్రాంత గ్రామాలను పర్యటించిన కలెక్టర్ ప్రియాంక అలా

## వరద ఉధృతిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## లోతట్టు గ్రామ ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలించాలి

## భారీ వర్షం కారణంగా పలు గ్రామాలకు రాకుపోకలు బంద్

**చర్ల, జూలై 26 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారులపై గోదావరి వరద నీరు తలపిస్తున్నది.భారీ వర్షాలతో జనం అతలాకుతలమవుతున్నటువంటి పరిస్తితి కనిపిస్తోంది .ఎటు చూసినా వర్షపు నీరుతో నిండుకొని ఉండడంవాహనాలకు బాటసారులకు భారీ వర్షం ఆటంకాన్ని మిగిల్చింది.పలు చోట్ల వరద నీరు ఇళ్ళల్లోకి చేరిన పరిస్థితి నెలకొంది . జలదిగ్బంధంలో చర్ల ప్రధాన కూడలిఅంబేద్కర్ సెంటర్ వున్నా ఇళ్లలోకి మోకాలి లోతు నీరు చేరడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.మరో మూడు రోజులు ఇలాగే భారీ వర్షం పడితే గనక ఈప్రాంతంలో చాలా నష్టం జరిగేటట్టు కనిపిస్తోంది.చర్ల లింగాపురం పంచాయతీ పరిధిలో వున్నా ఈత వాగు పూర్తిగా మునగడంతో ముంపు ప్రాంతాలు ఐనటువంటి ఐదు గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుదునూరు ప్రధాన రాహదారి పై నీళ్లు రోడ్డు పైకి రావడంతో వాహనాలు ఒక గంటపాటు నిలిచిపోయాయి.విషయం తెలుసుకున్న చర్ల సీఐ అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని వరద ఉధృతి తగ్గక ట్రాఫిక్ ని క్లియర్ చేయడం జరిగింది. ముంపు ప్రాంతాల ప్రజలకు అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా వస్తున్న గోదావరి వరద గ్రామాలలోకి చేరి ముంచేస్తుంది అని తెలియజేశారు. కొత్తపల్లి,దండుపేట గ్రామాల్లో వున్నా గ్రామస్థులకు చర్ల రాళ్లగూడెంలోని ప్రాథమిక పాఠశాల నందు



పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. రాకపోకలు నిలిచిపోవడంతో విషం తెలుసుకున్న కలెక్టర్ ప్రియాంక అలా చర్ల ముంపు ప్రాంతాలను పర్యటించి అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ముంపు ప్రాంతాల్లో ఉండే గ్రామ ప్రజలను ఎట్టి పరిస్థితులనైనా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలను జారీ చేశారు. తాలుపేరు ప్రాజెక్టు 24 గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో భారీగా వస్తున్న వరద నీరును మండలంలోని ముంపు ప్రాంతాలను పరిశీలిస్తు అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఏ ఒక్క ప్రాణికి కూడా ప్రాణ నష్టం జరగద్దని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు , భద్రాచలం ఏ ఎస్ పి పరితోష్ పంకజ్ ,తాలిపేరు డి ఈ తిరుపతి , చర్ల సీఐ బి అశోక్ , చర్ల మండల తాసిల్దార్ భరణి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ లో బిజెపి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

- సిపిఐ సిపిఎం జిల్లా కార్య దర్శులు సాబీర్ పాషా కనకయ్యలు డిమాండ్
- జోరు వానలో నిరసన




**భద్రాద్రి కొత్తగూడెం జూలై 26 (మనం ప్రతినిధి) :** మణిపూర్ రాష్ట్రంలో గత రెండు నెలల కాలంగా సాగుతున్న మారణకాండ, స్త్రీలపై అఘాయిత్యాలు, గృహ దహనాలు ఆపాలని ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని, బాధితులకు అండగా నిలవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా ఈరోజు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో ఉభయ పార్టీల ఆధ్వర్యంలో. జోరు వర్షంలో సైతం తడుస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు..... ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ ,సిపిఎం జిల్లా కార్య దర్శులు ఎస్కే. సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్యలు మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై దేశ ప్రధాని నోరు విప్పాలని పార్లమెంట్లో సమగ్ర చర్చ జరిపి బాధితులు కు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జములయ్య మహిళా సమైక్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. రత్నకుమారి, సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, ఐద్వా నాయకురాలు సందకూరి లక్ష్మి , కే సమ్మయ్య, బిక్కులాలు, సిపిఐ, సిపిఎం నాయకులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, షాహిన్, షమీమా అబ్బులు, కిలారు ప్రసాదు, నవీన్, భద్రం, రమేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దనసరి సూర్య జన్మదిన వేడుకలు

- రావుల కృష్ణ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**మణుగూరు జూలై 26 (మనం న్యూస్) :** ధనసరి సీతక్క కుమారుడు, కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీ సూర్య జన్మదిన వేడుకలు పినపాక నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. బుధవారం పీవీకాలనీలోని కమ్యూనిటీ హాల్లో జరిగిన వేడుకలకు రావుల కృష్ణ అధ్యక్షత వహించగా, ఆత్మీయులు, అనుచరుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి, సూర్య మాట్లాడుతూ.. తమకు ప్రజల కష్టాలు తెలుసునని, ఎమ్మెల్యేగా పుట్టలేదని, ప్రజల మన్ననలు పొందిన అనంతరమే అమ్మకు ములుగులో ప్రజలు పట్టం కట్టారని, పినపాక నియోజకవర్గంలో ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుంటూ ముందుకుసాగుతున్నానని తెలిపారు. తన కష్టాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీగా నియమించిందని, త్వరలో పినపాన నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు సర్వశక్తులు ఒడ్డి కృషి చేస్తానని



తెలిపారు. అందరూ తమ ఆహ్వానాన్ని మన్నించి జోరు వానలోనూ పుట్టినరోజు వేడుకలకు వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ధనసరి సూర్య దంపతులకు నాయకులు పటాకులు కాలుస్తూ.. డీజేలతో నృత్యాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. జోరు వానలోనూ భారీగా తరలివచ్చిన అనుచరుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నేత వెలగపల్లి జాన్, కాలసాని సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వరలక్ష్మి, ధానధర్మ ట్రస్ట్ చైర్మన్ ఘంటా రాధ, నాగరాజు, రావుల క్రిష్ణ, ఆరిఫ్ పాషా, అచ్చా నవీన్, సాంబ శివ రావు, పల్లపు సంపత్, పాల్గొన్నారు.

# ప్రజల మధ్యనుండి నన్నెవరూ దూరం చేయలేరు

**– వనమా వెంకటేశ్వరరావు**

**– హైద్రాబాద్ నుండి ప్రకటన విడుదల**



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 26 (మనంప్రతినిధి):** తెలంగాణ హైకోర్టు తనపై అనర్హత వేటు వేసిన నేపథ్యంలో, సీనియర్ రాజకీయ నాయకులు, హైకోర్టు తీర్పుకు ముందు కొత్తగూడెం ఎమ్మెల్యేగా కొనసాగిన వనమా వెంకటేశ్వరరావు, బుధవారం హైదరాబాద్ నుండి ప్రకటన విడుదల చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా , ఎన్ని కుట్రలు పన్నినా కొత్తగూడెం ప్రజల నుండి తనను ఎవరు దూరం చేయలేరని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల మద్దతుతో ప్రజల ఓట్లతో గెలిచిన వాడినని, తానేమీ రిగ్గింగులు , దొంగ ఓట్లతో గెలవలేదని, అక్రమంగా గెలవలేదని, ప్రజాక్షేత్రంలో ప్రజలతో ఎన్నికైన వాడినని పేర్కొన్నారు. తానేమీ గాలికి వచ్చిన వాడిని కాదని, వార్డు స్థాయి నుండి అంచలంచెలుగా 20 సంవత్సరాలు సర్పంచ్ గా , నాలుగు సార్లు ఎమ్మెల్యేగా , మంత్రిగా పనిచేసిన వాడినని పేర్కొన్నారు. అధికారం , పదవులు తనకు కొత్త ఏమీ కాదని, గెలిచినా ఓడిన కొత్తగూడెం ప్రజల మధ్యనే ఉన్నానని, ఉంటున్నానని, 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్ననని, తనకు ఈ ఆటుపోట్లు కొత్తేమీ కాదని, తన 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో గెలిచినా, ఓడినా ప్రజల మధ్యనే ఉన్నానని, తాను గెలిచిన దగ్గర నుండి ఇదిగో రెండు నెలల్లో కోర్టు తీర్పు వస్తుంది , అదిగో ఆరు నెల్లలో తీర్పు వస్తుందని తనపై గోబెల్ ప్రచారాలు చేస్తూ తనను అనేక రకాలుగా , మానసికంగా ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయాల్లో గెలవడం ఓడడం రాజకీయ నాయకులకు తప్పదు. కానీ గెలిచినప్పుడే ప్రజలతో ఉంటూ , ఓడితే ప్రజలకు దూరంగా ఉండటం అనేది ప్రజలకు ద్రోహం చేసినట్లేనని అభివర్ణించారు. కానీ తనపై కుట్రలు చేసిన వాళ్లు నన్ను ఎలాగైనా పదవి నుండి తప్పించాలని ఉద్దేశంతో తాను గెలిచిన నాలుగున్నర సంవత్సరాలు ఆ పెద్దమనిషి కోర్టులు చుట్టే తిరిగాడని, అలానే ప్రజల కష్టనష్టాలు వదిలేసి కాలక్షేపం చేశాడని విమర్శించారు. తాను గెలిచిన దగ్గర నుండి కొత్తగూడెం నియోజకవర్గానికి వేలకోట్లు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నానని, ఒకవైపు అభివృద్ధి చేస్తూ , ఇంకొక వైపు పార్టీ పటిష్ఠత కొరకు తీవ్రంగా కృషి చేశానని, తాను ఎమ్మెల్యేగా ఉండి కేసీఆర్ మద్దతుతో కొత్తగూడెం నియోజకవర్గంలో 80 శాతం మంది ప్రజాప్రతినిధులు గెలుపులో కీలకపాత్ర వహించి కేవలం ప్రతిపక్షాలకు 20 శాతం మాత్రమే అవకాశం ఇచ్చానని గుర్తు చేశారు.తన 40 ఏళ్ళ ప్రయాణంలో ప్రజలతో మమేకమవుతున్న మున్నూరు కాపు , బీసీ వర్గానికి చెందిన తనపై ఇన్ని కుట్రాలా ..? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వక్రమార్గాలతో రాజకీయ నేతను కాలేదని, ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం కలిగిన నేతనని, గురువింద గింజ తన క్రింద ఉన్న నలుపు మరిచి నీతులు చెప్పినట్లు కొందరు ప్రజాభిమానం కోల్పోయి నాకు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లిచినట్టు గా ఉందని పేర్కొన్నారు. వనమా జీవితం తెరిచిన పుస్తకమని వనమా అంటే నిరుపేదల పక్షపాతి, వనమా అంటే కొత్తగూడెం నియోజకవర్గ పక్షపాతి అనే పేరు సంపాదించుకున్నానని, ఓడిపోగానే జనాన్ని వదిలేసి ఇతర దేశాల్లో హైదరాబాదులో ఉంటూ ప్రజల కష్టాలను గాలికి వదిలేసిన నేతను కానని పేర్కొన్నారు. కరోనా టైంలో ప్రతి ఇంటికి వెళ్లి వారికి అండగా నిలిచిన నేతను తానేనని తెలిపారు. తెలంగాణ జాతిపిత కెసిఆర్ సంపూర్ణ దీవెనలతో , కేటీఆర్ ఆశీస్సులతో మళ్ళీ పోటీ చేస్తానని, గెలిచి కొత్తగూడెంను కేసీఆర్ కు కానుకగా ఇస్తానని పేర్కొన్నారు. రాముడికి లక్ష్మణుడిగా చివరి శ్వాస వరకు గౌరవ కేసీఆర్ అడుగుజాడల్లో అడుగునవుతానని, బంగారు తెలంగాణలో భాగస్వామిని అవుతానని వనమా తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉప్పొంగి ప్రవహిస్తున్న కిన్నెరసాని–జల్లేరు వాగులు

**నదులను తలపిస్తున్న పొలాలు**

**కొత్తగూడెం–ఆళ్లపల్లి కి నిలిచిపోయిన రాకపోకలు**

**మండల వ్యాప్తంగా పలు గ్రామాలు జలదిగ్బంధం**





**ఆళ్లపల్లి, జూలై 26 (మనం న్యూస్):** మండలంలో వ్యాప్తంగా ఎడతెరిపి లేని వానలు కురుస్తుండడంతో వాగులు గొర్రెలు ఉప్పంగి ప్రవహిస్తున్నాయి మండల వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురవడంతో కిన్నెరసాన్ని, జల్లేరు, కోడేలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మోట్లగూడెం రాయపాడు గ్రామాల మధ్య కిన్నెరసాని వాగు పై గల లో లెవెల్ వంతెన పైనుండి భారీగా వరద నీరు పోతుండడంతో ఆళ్లపల్లి నుండి కొత్తగూడెం ప్రయాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. మండల పరిధిలోని సీతానగరం, చంద్రాపురం, కర్నె గూడెం, బోడయికుంట, అడవిరామరం, రాయి గూడెం, గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చెరువులు కుంటలకు భారీగా వరద నీరు చేరడంతో అలుగులు నదులను తలపించేలా పొలాల మీదుగా వాగులలోకి చేరుదండడంతో వాగులు మరింత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోని రేగడి చెరువు నిండి అలుగు పడడంతో సమీపంలోని గ్రామస్తుల ఇంటి లోపలికి నీరు చేరి వస్తువులు తడిచి అపార నష్టం జరిగింది. వాగులు, ఒర్రెలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో రెవిన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులు, ఒర్రెల వద్ద ప్రయాణికులు గ్రామస్తులు దాటే ప్రయత్నాలు చేయకుండా పర్యవేక్షిస్తూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



# పోలీస్ రెస్క్యూ కంట్రోల్ ఏర్పాటు : ఎస్పీ డాక్టర్ వినీత్ జి

**– ఆపదలో ఉన్నవారు వాట్సాప్ లొకేషన్ పంపి పోలీసుల సేవలను పొందండి**

**భద్రాద్రి కొత్తగూడెం జూలై 26 (మనం ప్రతినిధి) :** గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు, నదులు, చెరువులు పొంగుతున్నాయి. ఎవరైనా వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్నట్లైతే వెంటనే జిల్లా పోలీస్ రెస్క్యూ కంట్రోల్ వాట్సాప్ నంబర్ '8712682128' కు ఫోన్ చేసి, వారి ఫోటోలు మరియు లొకేషన్ ను పంపి పోలీసుల సహాయం పొందవచ్చని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఆపదలో ఉన్న ప్రజల సంరక్షణ కొరకు 24/7 జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# వరద ఉధృతినీ పరిశీలించిన సిఐ జితేందర్ రెడ్డి



**నేలకొండపల్లి, జూలై 27 (మనం న్యూస్) :** కూసుమంచి సీఐ జితేందర్ రెడ్డి, నేలకొండపల్లి ఎస్ఐ సతీష్ నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లి గ్రామంలోని బ్రిడ్జిని, బుద్ధారం, నాచేపల్లి, కొంగర, పైనంపల్లి, సదాశివపురం, భైరవునిపల్లి గ్రామాలలోని చెరువుల్ని వాగుల్ని సందర్శించారు. అక్కడ ప్రజలు ప్రజలను ఉద్దేశించి చెరువుల్లోకి వాగుల్లోకి ప్రజలు ఎవరు వెళ్ళవద్దని మత్స్యకారులు కూడా చేపలు పట్టడానికి వెళ్లవద్దని సూచించారు. మండలంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# పులిగండ్ల మాధవరావు జన్మదిన వేడుకలు



**ఇల్లందు, జూలై 26 (మనం న్యూస్):** ఇల్లందు పట్టణంలో పెన్షనర్ భవన్ లో బుధవారం డిసిసి డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు చోటు యూత్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి పులిగళ్ళ మాధవరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పులిగళ్ళ మాధవరావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి పూల బొకేలు చేతికి అందించి శాలువాతో ఘనంగా సన్మానించిన తర్వాత మాధవ్ అన్న కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో చోటు, డిసిసిబి డైరెక్టర్ జనగాం కోటేశ్వరావు , మాదిగ జేఏసీ భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రవి మాదిగ , మునుగురి రమేష్, తెలంగాణ ఉద్యమ నాయకుడు పడిదల నవీన్ , సుమన్ , రంజిత్, యూత్ పాల్గొని పులి గళ్ళ మాధవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియ ఎరచినారు అధిక సంఖ్యలో పాల్గొని జన్మదిన కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు.....

# కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయలక్ష్మి పర్యటన



**ఇల్లందు, జూలై 26 (మనం న్యూస్):** ఇల్లందు నియోజకవర్గంలో బయ్యారం మండలంలో బుధవారం కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీ గడపగడపకు అనే కార్యక్రమం తీసుకుని గత కొంతకాలంగా పార్టీ గెలుపుకు కృషి చేస్తూ పర్యటిస్తున్నారు అందులో భాగంగా బుధవారం1.చోక్లా తండ 2.వెంకట్రా పురం 3.సంగ్య తండా4.బాలోజి తండా.గ్రామాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు బానోతు విజయలక్ష్మి విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో ప్రజల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఏ విధంగా లబ్ధి చేకూరుస్తాను వారికి వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తు పాదయాత్ర కొనసాగించారు.వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎవరు అధైర్య పడద్దని అందరికీ కాంగ్రెస్ అండగా ఉంటుందని అభయాస్తమే మీకు రక్ష అని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయలక్ష్మితో పాటు భర్త బానోత్ కిషన్ నాయక్ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ డి సి సి సెక్రటరీ,బి.వాస్య, జి.కిషన్, రామారావు పాల్గొన్నారు.

# రేగడి చెరువు అలుగు ఉగ్రరూపం

**ఇంటిలోకి చేరిన వరద నీరు**

**ఇబ్బందుల్లో ఇంటి నివాసులు**



**ఆళ్లపల్లి, జూలై 26 (మనం న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోనీ రేగడి చెరువు అలుగు ఉగ్రరూపంగా ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ వరద ప్రవాహం వల్ల సమీపంలోని తాళ్లపల్లి నాగేశ్ ఇంటిలోకి భారీగా వరద నీరు చేరడం వల్ల ఇంటిలోని వస్తువులు నీట మునిగి ఇంటిలోకి చెత్త పాములు సైతం కొట్టుకొచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా భారీ వర్షాలు కురిస్తే మోరి పై నుండి వరద నీరు ప్రవహించి సమీపంలోని అన్ని ఇలలోకి వరద నీరు చేరుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి ఆళ్లపల్లి– మర్కోడుకు ప్రధాన రహదారి కావడంతో మర్కోడు ఉమ్మడి పంచాయతీ పరిధిలోని సుమారు 10 గ్రామాలకు మండలం నుండి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని గ్రామస్తులు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వర్షాకాలం సమయంలో ప్రతి సంవత్సరం ఈ వరద ఉధృతితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించలని గ్రామస్తులు కోరుతున్నారు

## జర్నలిస్టులకిచ్చిన హామీలను అమలు చేయాలి..

### – సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డు లేఖలు



**మరిపెడ, జూలై 26(మనం న్యూస్):** తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా టి యు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలో జర్నలిస్టులు పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ కు జర్నలిస్టుల సమస్యలను తెలిపారు. ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు – ఇల్లు ఇవ్వాలని. హెల్త్ కార్డులు పనిచేసే విధంగా చూడాలని, అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, దళిత జర్నలిస్టులందరికీ నేరుగా దళిత బంధు వర్తింపచేయాలని, తదితర డిమాండ్లతో కూడిన అంశాలను పోస్టుకార్డులో సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యవర్గ సభ్యులు జిన్న లచ్చయ్య, మండల అధ్యక్షులు అక్తర్ పాషా, సీనియర్ జర్నలిస్టులు గాడిపేల్లి శ్రీశైలం, గంధసిరి ఉప్పలయ్య, పోతుల గోవర్ధన్, పస్నాధుల వేణుగోపాల్, మచ్చ రాజేష్, మెరుగు సంజీవ, దోమల శ్రీనివాస్, చంద్రశేఖర్, బోడ శ్రీను, తప్పట్లా సురేష్, గంధసిరి చిన్న ఉప్పలయ్య, చింతవెంకన్న, పోస్ట్ వెంకన్న, తదితరులు ఉన్నారు.ః

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్



**డోర్నకల్, జూలై 26 (మనం న్యూస్) ః** తెలంగాణ రాష్ట్రం లో గత 4 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నాయకులు నెహ్రూ నాయక్ సూచించారు. మున్నేర్, ఆకేరు, పాలేరు, వాగులు ఉధృవంగా ప్రవహిస్తున్నాయని, నీటి ప్రభావం పెరిగే అవకాశం ఉందని, ప్రజలు వాగుల దగ్గరికి వెళ్లొద్దని అన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు అని అన్నారు. విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవుల నేపథ్యంలో పిల్లలకు బయటికి రాకుండా తల్లిదండ్రులు ఇంట్లోనే ఉంచాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంతవరకు బయటకు రావద్దని అన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై పరిష్కరించాలి



**తొర్రూర్, జూలై 26 (మనం న్యూస్):** టియుడబ్ల్యూజె ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తొర్రూర్ డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టు సమస్యలపై నేడు పోస్ట్ కార్డు ద్వారా తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన భూమిక అత్యంత కీలకమైనది మీరు అనేకమార్లు ప్రశంసించారు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా నెరవేర్చాలని అర్హులైన జర్నలిస్టులు అందరికీ వెంటనే ఇళ్లస్థలాలు మరియు అకస్మాత్తుగా అనారోగ్యాలకు గురి అవుతున్న జర్నలిస్టులు చికిత్స పొందే ఆర్థిక సోమత లేక అర్ధాంతరంగా మృత్యువాత పడుతున్నారు మరికొందరు వైద్యం కోసం అప్పులపాలు అవుతున్నారు ఒఎఖి. (జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్) కింద అందించిన హెల్త్ కార్డులు అమలయ్యేలా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు టీయూడబ్ల్యూజే ఐజేయు జాతీయ కౌన్సిలింగ్ సభ్యులు. దూలం శ్రీనివాస్. ఎలక్ట్రానిక్ మీడియా మహబూబాద్ జిల్లా అధ్యక్షులు. నాగపురి అశోక్ గౌడ్. జిల్లా.ఐజేయు ఉపాధ్యక్షులు. వెంకటరమణ. ఐజేయు సభ్యులు.. గిరి కత్తుల శ్రీనివాస్ గౌడ్. పంజల శ్రీకాంత్ హెచ్ఎంటీవీ సుమన్. కొయ్యాడ సాంబశివ గౌడ్. పంజాల శ్రీకాంత్. బోలగాని రవి. అంకం సురేష్, డిడి న్యూస్ ప్రవీణ్. స్6 ఏకాంతం. చిలుకమారి.భాస్కర్. వెలుగు రవి. వీరాంజనేయులు. భోగ సురేష్. మరియు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సారా అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

**గార్ల జూలై 26(మనం న్యూస్):** సారా అమ్ముతు పట్టుబడిన బానోత్ భరత్ పై కేసు నమోదు చేసినట్లు గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న తెలిపారు.బుధవారం హెడ్ కానిస్టేబుల్ శ్యాం కానిస్టేబుల్ మంగీలాల్ హోమ్ గార్డ్ కిషన్ లు గార్ల నుండి అంజనాపురం పెద్ద కిస్టాపురం ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం 9 గంటలకు అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ భరత్ మోటార్ సైకిల్ యాక్టివాపై అనుమానాస్పదంగా కనిపించగా అతన్ని పట్టుకొని పరిశీలించగా ఒక సంచిలో ప్రభుత్వం నిషేధించిన 15 లీటర్ల నాటు సారాయి ఉండటంతో సదరు వ్యక్తి భరత్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ శశాంక



**మహబూబాబాద్, జూలై,26(మనం ప్రతినిధి):** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని నదులు వాగులు వంకలు ప్రమాద స్థాయిలో పొంగిపొర్లు తున్నందున ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటు న్నామని ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. మంగళవారం ఐడిఓసిలోని కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు.జిల్లాలో సుమారు 26 రోడ్లను భద్రత దృశ్య మూసి వేయడం జరిగిందని అందుకు ప్రత్యామ్నాయ రోడ్లను సూచించడం జరిగిందన్నారు అదేవిధంగా 17 శిథిలావస్థలో ఉన్న ఇండ్లను కూడా గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు.1594 చెరువులకు గాను 601 చెరువులు అలుగు పారుతున్నాయని , 487 చెరువులు 75% పైగా నిండాయని తెలియజేశారు.చెరువులో నిండుగా ఉన్నాయని చెక్ డ్యాములు నీటితో నిండి అలుగు పోస్తూ అందంగా కనిపిస్తు న్నాయని ఉద్దేశంతో యువత సెల్ఫీలు దిగరాదని ప్రమాదం కొని తెచ్చుకో రాదని కలెక్టర్ సూచించారు. పశువుల కాపర్లు వాగులు వంకలు దాటి వెళ్ళరాదన్నారు వ్యవసాయదారులు నాట్లు వేసే పనులను నిలుపుదల చేయాలని కోరారు చెరువులో నుండి ఉన్నందున మత్స్యకారులు చెరువులలోకి పోరాదని చేపలు పట్టే ప్రయోగం చేయరాదన్నారు అదేవిధంగా చెరువులు చెక్ డ్యాములు పొంగి పొర్లి ప్రవహిస్తున్నందున అలుగుల వద్ద పిల్లలను వెళ్ళనీయరాదని తెలియజేశారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏడు శిధిలమైన భవనాలను తొలగించినట్లు చెప్పారు. అదేవిధంగా విద్యుత్ పోల్స్ కూడా రెండు తొలగించినట్లు చెప్పారు.ప్రజలు భారీ వర్షాలకు ఇబ్బందులు పడరాదని లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని పునరావాస కేంద్రాలను తక్షణం ఏర్పాటు చేయిస్తామన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

### – పిఆర్టీయూ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి



**మరిపెడ, జూలై 26(మనం న్యూస్):** ఇటీవల ఏర్పడిన అల్పపీడనంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తూ వాగులు,వంకలు ఉప్పొంగుతున్నందున విద్యార్థులు ఇంటి నుండి బయటికి రాకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిఆర్టీయూ మరిపెడ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు బయటికి వెళ్లకుండా ఇంటిలోనే ఉంటూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పునఃశ్చరణ చేసుకోవాలని అన్నారు.కూలిన గోడల దగ్గర ఉండకూడదని, కరెంటు స్తంభాలను ముట్టుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ః సిఐ



**డోర్నకల్, జూలై 26 (మనం న్యూస్) ః** గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డోర్నకల్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బంధం ఉపేంద్రరావు సూచించారు. మున్నేరు, ఆకేరు, పాలేరు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి వాగులు వంకలు పొంగిపొర్లి చెరువులు కుంటలు నిండుకుండ లాగా ఉన్నాయీ కావున ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల వద్దకు పిల్లలు,యువత ఎవరూ చెరువుల చేపల వేటకు వెళ్ళొద్దు అని అన్నారు.ఆయా గ్రామాల సర్పంచులు చెరువుల వద్ద మరియు వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. వర్షానికి ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టి ఇండ్లు కూలిపోయే అవకాశం ఉంటుందని అందులో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ఫీ మోజులో పడి ప్రాణాలు కోల్పోవద్దు అని చెప్పారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం కు డయల్100 సమాచారం ఇవ్వాలని కోరారు.వర్షాల దృష్ట కరెంటు స్తంభాల దగ్గర కు ఎవరు వెళ్లకూడదని అన్నారు. రోడ్ల పైన ఎలాంటి చెట్లు పడిన పోలీస్ శాఖ వారికి సమాచారం అందించాలని సూచించారు.

## వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### సిఐ సత్యనారాయణ



**తొర్రూరు, జూలై 26 (మనం న్యూస్):** వ ుహ బూ బా ద్ జిల్లాను రెడ్ జోన్ కింద ప్రకటించి నందున అధిక వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఎవరు కూడా నాట్లు వేయడానికి కూలీలను తీసుకెళ్ల కూడదని సిఐ సత్యనారాయణ సూచించారు. పశువులను మేపడానికి పొలాల వెంబడి, వాగుల వెంబడి వెళ్లొద్దని ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరు కూడా చేపలు పట్టుటకు వెళ్లకూడదు, అత్యవసరమైతే తప్ప ఎటువంటి ప్రయాణాలు చేయకూడదని, బోర్ బావుల వద్ద కరెంటు స్తంభాల వద్ద జాగ్రత్త వహిస్తూ పై నియమాలు పాటించాలని కోరారు.

## ప్రభుత్వ సిబ్బంది కార్యస్థానాల్లో

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని చెప్పారు. మంచినీటి సమస్య వచ్చిన ప్రాంతాల్లో పంచాయతీ, రెవెన్యూ అధికారులు మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. మంచినీటి పరీక్షలు చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్ళ కుండా పటిష్ట నియంత్రణ చేయాలని చెప్పారు. రెండు రోజులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. నీళ్లు నిలిచే ప్రాంతాల్లో రవాణా సేవలు నిలిపి వేసేందుకు పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని చెప్పారు. రానున్న రెండు రోజులు అత్యంత కీలకమని ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, మధుసూదన్ రాజు, ఆర్ అండ్ బి ఈ ఈ భీంలా, జిల్లా వైద్యాధికారి డా శిరీష, డా రవి బాబు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

## అధికారులను అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

సేవల కోసం ప్రజలు కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేయాలని, ప్రజలు ఇళ్ల నుండి బయటికి రావొద్దని సూచించారు. ప్రజలు ఆయా గ్రామాల్లో పొంగిపొర్లుతున్న వాగులు దాటకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట పరచాలని, రహదారులపైకి నీరు చేరిన ప్రాంతాల్లో ప్రజలు రవాణా చేయడానికి అవకాశం లేకుండా బారికేడింగ్, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం..

## పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉంది.. ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొంటాం మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్, జూలై 26(మనం ప్రతినిధి):** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు పొంగిపొర్లుతున్న దృష్ట్యా అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందరాదని రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు వంకలు ఉప్పొంగి



ప్రవహిస్తున్నందున మంత్రి జిల్లా కలెక్టర్ శశాంక ,ఎస్పీ శరత్ చంద్ర పవార్ , ఎమ్మెల్యే శంకర్ నాయక్ , మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి లతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి వద్ద తగ్గుముఖం పట్టాయి దన్నారు.నెల్లికుదురు మండలంలోని వావిలాల, రావిరాల రహదారుల మీదుగా ప్రవహిస్తున్న వరద కూడా తగ్గిందన్నారు.నెల్లికుదురు తొర్రుర్ మండలాల మధ్య కాచికల్ , మడుపల్లి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న ఆకేరు వాగు వరద ప్రవాహాన్ని మంత్రి జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారుల తో కలిసి పరిశీలించారు. వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేశామని అన్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తమ తమ కార్య స్థానాల్లోనే అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా అధికారులకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. శిథిలావస్థ ఇండ్లలో ఎవరు ఉండకూడదని, వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. అన్ని పీ.హెచ్.సీలలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా, అన్ని రకాల మందుల నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని, గర్భిణీలను సైతం పిహెచ్ సి లకు తరలించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలన్నారు. చెరువులు, వాగులు, కుంటల వద్దకు మత్స్యకారులు, వ్యవసాయ కూలీలు వెళ్లవద్దని హితవు పలికారు. చెరువులు పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకున్నాయని తెలిపారు.వర్షాలతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా, భూగర్భ జలాలు పెరిగాయని, బోర్లలో నీటి నిల్వలు పెరిగాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖల అధికారులు వెంకటేశ్వర్లు సమ్మిరెడ్డి నారాయణ నెల్లికుదురు తాసిల్దార్ యోగేశ్వరరావు నర్సింహులపేట తహసిల్దార్ వివేక్ ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు మండలంలో పర్యటించిన మంత్రి ఎర్రబెల్లి

## అలుగు పోస్తున్న తొర్రూరు, కంటాయపాలెం, గుర్తురు చెరువులు అలుగును చూసి హర్షం వ్యక్తం చేసిన మంత్రి



**తొర్రూరు, జూలై 26: (మనం న్యూస్):** గత 2, 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూరు మండలంలో అలుగు పోస్తున్న చెరువులను పరిశీలిస్తూ రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా అలుగు పోస్తున్న తొర్రూరు, కంటాయపాలెం, గుర్తురు చెరువులను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఎర్రబెల్లి అలుగు పోస్తున్న చెరువులను చూసి తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ... మొన్నటి దాకా వర్షం రాక కాలం ఏమి అయితుంది అని బాధపడినం అన్నారు. కానీ వరుణుడు కరుణించి గత 5 రోజులుగా వాన పడుతుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. మత్తడితో కింది చెరువులు నిండి, మత్తడి పడ్డ నీరు వాగులు, వంకలుగా వెళితే, ఆ చుట్టుముట్టు భూగర్భ జలాలు పెరుగుతున్నాయి అన్నారు. ఈ మత్తడి పారుతున్న చెరువులను చూస్తుంటే తన మనస్సు పులకిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హామీలను విస్మరించి ఆర్భాటాలు ఎలా మంత్రి గారూ..

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల రామ్ రెడ్డి

**తొర్రూర్, జూలై 26 (మనం న్యూస్):** గత సంవత్సరం వర్షాకాలంలో వరద ఉధృతికి కంటాయపాలెం లో మనిషి చనిపోతే కంటయపాలెం చెరువు అలుగుపై బ్రిడ్జి కట్టిస్తామని చెప్పి నేటికీ సంవత్సరం అవుతున్న అతి గతి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాటి నుండి ఈరోజు వరకు కూడా దాని ఊసేత్తని దయాకర్ రావు ఎన్నికలు వస్తున్నాయని ఈరోజు చెరువు వద్ద ఆర్భాటం చూస్తుంటే సిగ్గేస్తుందన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో చెరువుల కట్టలకు బుంగలు పడితే రిపేర్ చేయని మంత్రి నేడు చెరువులను సందర్శించడం సిగ్గు సేటు అని విమర్శించారు. గర్తురు చెరువు మత్తడికి బుంగబడితే ఇప్పటివరకు మరమత్తు చేయలేని మంత్రి మనకు అవసరమా అని అన్నారు. అంతేకాకుండా తొర్రూరు నర్సంపేట ప్రధాన రహదారిపై గుర్తుర్ దగ్గరలో ఐ లెవెల్ బ్రిడ్జి నిర్మానించాల్సి అవసరం ఉన్న ఇంతవనరకు చేపట్టలేదన్నారు. ఇన్ని రోజులు 100 పడకల ఆసుపత్రి గుర్తుకు రాలేదని ఝాన్సీ రెడ్డికి భయపడి పత్రిక లో మంజూరైనట్టు ప్రచారం చేసుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. అసలు టూరిస్టు నీవేనని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షులు దీకొండ మధు, సీనియర్ నాయకులు కంచర్ల వెంకటాచారి, కందాడి అచ్చిరెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, మేకల కుమార్, యూత్ అధ్యక్షుడు అభిరామ్ , సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



**మరిపెడ, జూలై 26(మనం న్యూస్):** కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల విరోచిత త్యాగాలను స్మరించుకుంటూ మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ సెంటర్ లో కార్గిల్ స్థూపం వద్ద స్మారక సంఘం తెలంగాణ చైర్మెన్ గాదె రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదె రాంబాబు మాట్లాడుతూ వీర సైనికుల త్యాగాలను స్మరించుకొని, దేశ రక్షణలో యువత ముందుండాలని వారు అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్ కార్గిల్ వీరులకు పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అమరుల త్యాగాలు మరువలేనివని, దేశం కోసం పోరాడి అసువులు బాసిన వారు ఎప్పటికీ చిరస్మరణీయులే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కార్గిల్ సొసైటీ సభ్యులు భూక్య గోపీ కృష్ణ, బాల్గూరి శ్రీనివాస్ రెడ్డి, కే గంగధర్, సుధాకర్ నాయక్, భూక్య శ్రీనివాస్, బానోత్ రాములు, జగన్నాయక్, హుస్సేన్ నాయక్, గడ్డం శివ, తప్పెట్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వని యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలి

## తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాల కాంతారావు



**డోర్నకల్, జూలై 26 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో గల అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించినప్పటికి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలో గల కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కేవలం పిల్లలకు మాత్రమే సెలవులు ఇచ్చి టీచర్లను స్కూల్ కి రమ్మని బలవంతం చేస్తున్నారని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాల కాంతారావు పేర్కొన్నారు. కొంతమంది భార్య భర్తలు ప్రైవేట్ టీచర్లుగా ఉన్నవారు తమ చిన్న పిల్లలను ఇంట్లో వదిలేసి జోరు వర్షంలో కూడా పాఠశాలకు హాజరు కావాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు వర్క్ షీట్స్,పేపర్ కరెక్షన్, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు పేరిట టీచర్లను వేధింపులకు గురి చేయటం సమంజసం కాదని అట్టి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిఇఓకు ఫిర్యాదు చేసినప్పటికీ ఉదాసీనంగ వ్యవహరించడం వలన ప్రైవేట్ యాజమాన్యాలు ఈ విధంగా టీచర్లను వేధింపులు గురి చేస్తున్నాయి ఈ విషయమై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం



**పెద్దవంగర, జులై 26, (మనం న్యూస్) :** మండలంలోని అవుతాపురం గ్రామంలో ఇటీవల మరణించిన మాంకాల చంద్రయ్య కుటుంబానికి 50 కేజీల బియ్యం, చింత లక్ష్మి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం మరియు జానకిపురం గ్రామానికి చెందిన పొల్లోజు అచ్చయ్య చారి కుటుంబానికి 5000 రూపాయలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూర శ్రీనివాస్ ఆర్థిక సహాయం చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కాసోజు సోమాచారి, మంకాల విఘ్నేశ్వర, ముదిరాజ్ యూత్ అధ్యక్షులు హనుమంతు, ఎస్సి సెల్ అధ్యక్షులు గద్దల స్వామి, సుధాకర్, గద్దే రాజు, వెంకటేష్, గోపాల్, సందీప్, వెంకన్న, ప్రభాకర్, సోమయ్య, రవి, రాజు, ఐలయ్య, శ్రీకాంత్, శివ, లక్ష్మి పాల్గొన్నారు.

# పైలేరియా బాధితులకు వస్తువులు పంపిణీ



**మహబూబాబాద్, జూలై 26(మనం ప్రతినిధిః** ఫైలేరియా బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ప్రభుత్వం అందిస్తున్న ఐదు ఉపకరణాలను జిల్లా కలెక్టర్ శశాంక వైద్యాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు.ఎం ఎం డి పీ కింద పంపిణీ చేస్తున్న బకెట్, మగ్గు, టవల్, సోప్, యాంటీ ఫంగల్ క్రీమ్ వంటి ఐదు వస్తువుల కిట్ ను జిల్లా వైద్యాధికారి హరీష్ రాజు ఆధ్వర్యంలో కలెక్టర్ బాధితులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువులను క్రమం తప్పకుండా వినియోగించుకొని ఉపశమనం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డి ఉపవైద్యాధికారులు డాక్టర్ మురళీధర్ అంబరీష ఉమగౌరి హెల్త్ ఎడ్యుకేటెడ్ పురుషోత్తం ఎం పి హెచ్ ఎస్ ఫైముద్దీన్ సబ్ యూనిట్ ఆఫీసర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.